# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 13.03.2025 | 24 క్యారెట్లు 86,445.00 | కిలో వెండి 1,07,778.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:142

www.vishalabharati.com







## ఆర్ఆర్ఆర్ వరకూ హెచ్ఎండీఏ

### నగర పరిధి భారీగా విస్తరణ

- హెచ్ఎండీఏ పరిధిలోకి మరో 4 జిల్లాల్లోని 16 మండలాలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. రియల్ ఎస్టేట్‌కు మళ్లీ రెక్కలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోకి మరో 4 జిల్లాల్లోని 16 మండలాలను చేరుస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. మహబూబ్‌నగర్, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లోని 16 మండలాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో కొత్తగా 3 వేల చదరపు కిలోమీటర్ల భూభాగం హెచ్ఎండీఏ పరిధిలోకి చేరనుంది. కొత్తగా చేర్చిన 16 మండలాలతో కలిపి...హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలు ఉన్నాయి.

**మొత్తం 11 జిల్లాలకు చేరిన పరిధి**

తెలంగాణ సర్కార్ హెచ్ఎండీఏ పరిధిని విస్తరించింది. హెచ్ఎండీఏ

..మిగతా 2 లో

# ఇలాగైతే మళ్లీ గెల్వుడు కష్టమే

## బీఆర్ఎస్ విమర్శిస్తుంటే.. మీరేం చేస్తున్నారు

- ఒక్కరూ ప్రతిఘటించడం లేదు
- ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో విప్‌లు విఫలం
- బీఆర్ఎస్ తప్పులను ఎందుకు ఎత్తిచూపడం లేదు
- ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళుతున్నాయ్
- రాజకీయాలంటే పిల్లలాట కాదు
- కొత్త ఎమ్మెల్యేలు నాన్ సీరియస్‌గా ఉంటే ఎలా..?
- ఇలాగే పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో గెలవరు
- సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి
- సీరియస్‌నెస్ లేనోళ్లు ఏ పని కోసం నా వద్దకు రావొద్దు
- సీఎల్పీ మీటింగ్‌లో ఎమ్మెల్యేలకు రేవంత్ వార్నింగ్



శాసనసభలో, మండలిలో ప్రతిపక్ష సభ్యులు చేసే విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గవర్నర్ ప్రసంగం సమయంలో బీఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుంటే సభ్యులు, విప్‌లు మౌనంగా ఉండటం ఏమిటని సీఎం అసహనం వ్యక్తం చేశారు. 'అప్పులు, తప్పులు చేసినవాళ్లు సభలో న్యూసెన్స్‌చేస్తుంటే ధీటుగా ప్రతిఘటించాలి కదా? ఈ విషయంలో విప్‌లు పూర్తిగా విఫలమయ్యారు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గురువారం నుంచి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని.. ఇవి రాష్ట్రాభివృద్ధికి అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సభలో ఎవరు ఏం మాట్లాడుతున్నారో రాష్ట్ర ప్రజలు గమనిస్తారని, అందుకు అనుగుణంగా సభ్యులు నడుచుకోవాలన్నారు. బుధవారం గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం

..మిగతా 2 లో

# స్ట్రెచర్ ఎక్కారు.. ఇక మార్చురీకే

## కేసీఆర్‌తో రాష్ట్రానికి ఆర్థిక క్యాన్సర్

- పదేళ్లలో తెలంగాణను అప్పుల పాలు చేశారు
- నిజం చెబుతుంటే 'రాష్ట్రం పరువు తీస్తున్నావు... దిగిపో' అంటున్నారు
- నేనెందుకు దిగాలి? నీ ఫాంహౌస్ గుంజుకున్నానా?
- అబద్ధాలతో మేము రాష్ట్రాన్ని నడపబోం
- ఫ్యామిలీ ప్యాకేజీలా అసత్యాలను ప్రచారం చేస్తున్నారు
- రాష్ట్ర ఆదాయం 18 వేల కోట్లు.. ఖర్చులు 22 వేల కోట్లు
- మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్
- 1,532 మంది కొత్త లెక్చరర్లకు నియామక పత్రాలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'పదేళ్ల పాటు ప్రజలు నీకు స్టేచర్ ఇచ్చారు... కానీ, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి నాశనం చేసినందుకు గత ఎన్నికల్లో స్ట్రెచర్‌పైకి తీసుకువచ్చారు. అయినా తీరు మారకపోతే రేపు మార్చురీకి పంపిస్తారు'' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 6070 ఏళ్ల క్రితం మేం కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ నిటారుగా,

..మిగతా 3 లో



## గవర్నర్ ప్రసంగం అంతా డొల్ల

- అబద్ధాలు చెప్పించిన ప్రభుత్వం
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎక్కడ..?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

..మిగతా 2 లో




## గ్రూప్–1 పరీక్షలపై మళ్లీ వివాదం

- ఇంగ్లీష్ మీడియానికే ప్రాధాన్యమా..?
- తెలుగు మీడియం వారికి కనీస మార్కులు వేయలేదు
- గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన
- నేడో రేపో టీజీపీఎస్సీకి ఫిర్యాదు

..మిగతా 2 లో

# రైతులే తెలంగాణ ఆత్మ

## అన్నదాతల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- రూ.25వేల కోట్లతో రుణమాఫీ చేశాం
- రాష్ట్రంలో ప్రజలే కేంద్రంగా పాలన సాగుతున్నది
- స్కిల్ యూనివర్సిటీతో యువత నైపుణ్యం పెంచుతున్నాం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు..
- ఎస్సీ వర్గీకరణ బిల్లు తీసుకొస్తున్నాం
- మహాలక్ష్మి పథకం గేమ్‌చేంజర్
- ఉచిత బస్సు స్కీమ్‌తో మహిళలకు రూ.5వేల కోట్లు ఆదా
- అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణకు రైతులు గుండెకాయ వంటివారని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం నుంచి తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ ప్రవేశపెడుతోందన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉందని, అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం, రైతులు, మహిళలు, యువతకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల



అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెప్పిస్తున్నారని బీఆర్ఎస్

..మిగతా 2 లో

## కేటీఆర్‌ను బట్టలూడదీసి కొడతారు..

- దమ్ముంటే విగ్రహాలపై చేయి వేసి చూడు
- అధికారం పోయినా అహంకారం తగ్గలే
- గవర్నర్ ప్రసంగాన్నే అవమానించేలా బీఆర్ఎస్ తీరు
- క్షమాపణ చెప్పాలన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

3 లో



# గవర్నర్‌ది గాంధీ భవన్ ప్రసంగం

- అట్టర్‌ఫ్లాప్ పాలనపై అబద్ధాలు మాట్లాడించారు
- ప్రభుత్వ వైఫల్యంతో రైతుల అరిగోస
- బీసీ కులగణన లెక్కలన్నీ తప్పులే
- ఒక్క బీసీ బిడ్డ అయినా మీ లెక్కలను అంగీకరించాడా..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేసిన బడ్జెట్ ప్రసంగం..గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ నోటి వెంట అబద్ధాలు, అసత్యాలు చెప్పించి ఆయన స్థాయిని దిగజార్చిందని ఆరోపించారు. 'బడ్జెట్ ప్రసంగంలో కొత్త

..మిగతా 2 లో





## అసెంబ్లీకి హాజరైన కేసీఆర్

- 45 నిమిషాల ముందే చేరుకున్న ప్రతిపక్ష నేత
- అసెంబ్లీలో అందరి దృష్టీ ఆయనపైనే
- అలా వచ్చారు.. ఇలా వెళ్లారు..

2 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం, 13.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# ఓటరు కార్డుకు ఆధార్, మొబైల్ లింక్

## రాష్ట్రాల సీఈవోలకు ఈసీఐ ఆదేశం



**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** ఓటర్ల గుర్తింపు సక్రమంగా జరిగేలా ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్, మొబైల్ నంబర్లతో లింక్ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీఐ) అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)కు సర్క్యులర్‌ను ఈసీఐ జారీ చేసినట్టు తాజాగా ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. దీంతోపాటు ఈనెల 4న నిర్వహించిన సీఈవోల కాన్ఫరెన్స్‌లో 'ఓపెన్ రిమార్క్స్ ఆఫ్ సీఈసీ' పేరిట సీఈవోలందరికీ పంపిణీ చేసిన పత్రాల్లోనూ అవే ఆదేశాలు జారీ చేశారు.




# గ్రూప్–1 పరీక్షలపై మళ్లీ వివాదం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఇటీవల విడుదలైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గ్రూప్1 మెయిన్స్ ఫలితాలపై తెలుగు మీడియం అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్ 1లో అత్యధికంగా 530కి పైబడి మార్కులు వచ్చిన వారున్నారు. అయితే తెలుగు మీడియం కేటగిరీలో 400 మార్కులు దాటలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా మాతృభాషలోని వారికి ఎక్కువ మార్కులు రావాలని, కానీ ఇంగ్లిష్ లో పరీక్షలు రాసినవారు టాప్‌లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూల్యాంకనంలో ఇంగ్లిష్ మీడియంకు ప్రాధాన్యత ఇచ్చారని, తెలుగు మీడియంలో పరీక్షలు రాసిన వారికి తక్కువగా మార్కులు వేశారని ఆరోపిస్తున్నారు విద్యార్థులు. చాలా అంశాల్లో తెలుగు మీడియం అభ్యర్థులకు కనీస మార్కులు వేయలేదని, ఫాక్ట్స్ రాసిన వాళ్లకు కొంత మేర మార్కులు ఇచ్చారని చెబుతున్నారు. విశ్లేషణాత్మకంగా జవాబులు రాసినవారికి తక్కువ మార్కులు వచ్చాయంటున్నారు. ప్రస్తుతం ఇచ్చిన మార్కులతో అంచనా వేస్తే... త్వరలో 1:2 నిష్పత్తిలో, ఆ తర్వాత తుది జాబితా విడుదలయ్యే నాటికి తెలుగు మీడియం అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై టీజీపీఎస్సీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# గవర్నర్ ప్రసంగం అంతా డొల్ల

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామని.. ప్రసంగమంతా పూర్తి డొల్ల అని అసెంబ్లీలో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు చేసినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవం అన్నారు. ఏవీ ఇవ్వకున్నా.. అన్ని ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా? అని నిలదీశారు. అబద్ధాల పునాదుల మీద ప్రసంగం ఉందని.. నిరుద్యోగ సాధికారిత అని మోసపూరిత మాటలు గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారని విమర్శించారు. బీఏసీలో సమస్యలపై చర్చకు ఎక్కువ రోజులు చర్చించేందుకు అసెంబ్లీ నడవాలని కోరామన్నారు. కేవలం ఐదురోజుల్లో ప్రజా సమస్యలపై, బిల్లులపై చర్చ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని.. కానీ సభలో గవర్నర్ చేత ఆరు హామీలు అమలయ్యాయని మాట్లాడించారని అన్నారు.

# ఇలాగైతే మళ్లీ గెల్వుడు కష్టమే

తరవాయి భాగం

జరిగింది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫథకాలను ప్రజల ముందు పెట్టేందుకు ఈ సమావేశాలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. కొత్త సభ్యులు ప్రతిరోజూ సభకు రావాలని, ఏ సభ్యునికి ఏ సబ్జెక్టుపై పట్టు ఉందో, ఆ అంశంపై మాట్లాడే ప్రయత్నం చేయాలన్నారు. సభలో సభ్యులను విప్‌లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా ప్రతిపక్షాలను ఎదుర్కోవాలన్నారు.

**త్వరలో ప్రతి ఎమ్మెల్యేతో సమావేశం..**

ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. ఇలాంటి మంచి పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో భేటీ అవుతానని, వారి సెగ్మెంట్లలోని సమస్యలన్నింటిపై చర్చిస్తానని తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందామని సూచించారు. మంత్రుల నియోజవర్గాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయి అనే భావన చాలా మందిలో ఉందని.. ఈ బడ్జెట్ సమావేశం లో అలా జరగదని... ఎమ్మెల్యేలందరికీ సమానంగా నిధులు ఇస్తామన్నారు.

**విప్‌లు ఎందుకు మాట్లాడటం లేదు..?**

గవర్నర్ ప్రసంగ సమయంలో అసెంబ్లీలో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళనలు చేస్తుంటే మీరేం చేస్తున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ సభ్యులు ఇది కమీషన్ల ప్రభుత్వం.. గోబెల్స్ ప్రచారం.. బోగస్ సర్వే.. అంటూ రన్నింగ్ కామెంట్రీ చేశారని.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారని.. అయినా కాంగ్రెస్ సభ్యులు ఏమాత్రం ప్రతిఘటించకుండా, తమకు సంబంధం లేనట్లుగా మౌనం వహించడంపై సీఎం రేవంత్ మండిపడ్డారు. 'విప్‌లు సభలో తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించారని, సభ్యులను సమన్వయం చేయడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ వాళ్లే కాంగ్రెస్ అప్పులపాలు చేస్తోందని అబద్ధాలు మాట్లాడుతుంటే.. న్యూసెన్స్ చేస్తుంటే వాళ్ల తప్పులను ఎత్తి చూపాలి కదా? ఎందుకు ఎవరూ స్పందించడం లేదని నిలదీశారు. ఇకనైనా ప్రభుత్వ విప్‌లు పనితీరు మార్చుకోవాలని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఇలా విఫలమైతే జనంలోకి తప్పుడు సంకేతాలు వెళతాయని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కొవాలని, సభ్యులు ఖచ్చితంగా సభకు రావాల్సిందేనని సీఎం సూచించారు.

**ఎమ్మెల్యే జయవీర్ రెడ్డిపై సీఎం ఆగ్రహం..**

సీఎల్పీ మీటింగ్ లో రేవంత్ రెడ్డి మాట్లాడుతుండగా నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లేచి బయటకు వెళ్లడం రేవంత్ రెడ్డి ఆగ్రహానికి కారణమైంది. ఓ వైపు నేను ఇంత సీరియస్‌గా చెబుతుంటే జైవీర్ రెడ్డి అలా వెళ్తున్నారు.. ఇంత నాన్ సీరియగా ఉంటారా అని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదని... ఒకసారి గెలవడం గొప్పకాదని.. మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప అన్నారు. బీఆర్ఎస్ పట్ల సాఫ్ట్ కార్నర్‌తో ఉంటే.. మీపై వాళ్లు అభ్యర్థిని పెట్టరనుకుంటున్నారా.. బీఆర్ఎస్ గురించి మీకు చాలా తక్కువ తెలుసు.. వాళ్ల గురించి నాకు బాగా తెలుసని..రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు. రాజకీయాలు అంటే పిల్లలాట అనుకుంటున్నారా.. సీరియస్‌గా పనిచేస్తే తప్ప వచ్చే ఎన్నికల్లో గెలవరని, ఇలాగే ప్రవర్తిస్తే ఇంకోసారి ఏ పని కోసమూ తన వద్దకు రావద్దని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. పార్లమెంట్ లో మూడుసార్లు ఎంపీల అటెండెన్స్ తీసుకుంటారని గుర్తు చేశారు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుందన్నారు. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దన్నారు.




# గవర్నర్‌ది గాంధీభవన్ ప్రసంగం

తరవాయి భాగం

విషయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలపై స్పష్టత ఇస్తారని, గత 15 నెలల పాలనపై ప్రాయశ్చిత్తం చేసుకుంటారని ఆశించాం. కానీ అలాంటిదేమీ జరగలేదుగానీ పెళ్లిలో చావుడప్పు కొట్టినట్టుగా ప్రసంగం ఉంది'అని విమర్శించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం పూర్తిస్థాయిలో ప్రజలను వంచించడమేనని, ఆయన ప్రతిష్టను సైతం తగ్గించిందని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యంతో రైతులు అరిగోసలు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని, 480 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా, గవర్నర్ ప్రసంగంలో ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చే ఒక్కమాట కూడా లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 25 నుంచి 30 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని, గవర్నర్ నోటి ద్వారా మాత్రం రుణమాఫీ పూర్తయిందని అబద్ధాలు చెప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం అందక ఆగమాగమవుతుంటే, రైతుబంధు అందిందని, అసత్యాలు వల్లించారని విమర్శించారు. సాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, గోదావరి పరీవాహకంలో పంటలు ఎండిపోతున్నాయని, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 83 మంది విద్యార్థుల మరణాలపై గవర్నర్ ప్రసంగంలో ఒక్క సానుభూతి మాట కూడా లేదని విచారం వ్యక్తం చేశారు.

**బీసీలకు సామాజిక న్యాయమా?**

కులగణన పేరుతో బీసీల సంఖ్య తగ్గించి, వారిని మోసం చేసి.. ఏదో ఉద్ధరించినట్టు సోషల్‌జస్టిస్ అని గవర్నర్ నోటివెంట అబద్ధాలు చెప్పించడం సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను అవమానించిందని తాము అనడం లేదని, అధికార కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఒకరు గళం విప్పితే, ఆయన్ను సస్పెండ్ చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క బీసీ సంక్షేమ సంఘమైనా కులగణన లెక్కలు సరైనవని అంటుందా? ఒక్క బీసీ బిడ్డ మీ లెక్కతో ఏకీభవిస్తున్నడా? మీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలైనా ఏకీభవించే పరిస్థితి ఉందా అంటూ ప్రశ్నించారు.

**నో విజన్.. ఓన్లీ కమీషన్**

భారతదేశంలో ఏ రాష్ట్ర సచివాలయంలోనూ జరగని ఘోర సంఘటన తెలంగాణ సచివాలయంలో జరిగిందని కేటీఆర్ దుయ్యబట్టారు. 20 శాతం కమీషన్ ఇవ్వకపోతే బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ధర్నా చేసిన సంఘటనే దీనికి నిదర్శనమని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదు.. కేవలం 20 శాతం కమీషన్ కక్కుర్తి మాత్రమే ఉందని మండిపడ్డారు. కమీషన్ నుంచి వచ్చిన డబ్బులను ఢిల్లీకి మూటలు పంపుతున్నారని ఆరోపించారు.

కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో రూ. 4.17 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే రూ.1.62 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. దావోస్‌లో రూ.1.79 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ ద్వారా అబద్ధాలు చెప్పించారని, గత ఏడాది చెప్పిన రూ.40,000 కోట్లలో ఒక్క పైసా కూడా రాలేదని, దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నమని, తెలంగాణ ప్రజలు సమయం వచ్చినప్పుడు సమాధానం చెప్పడం ఖాయమన్నారు.

**పిచ్చికుక్క హద్దులన్నీ దాటేసింది**

'మర్యాదకు ఉండే హద్దులన్నింటినీ పిచ్చికుక్కదాటేసింది. అతడిని వెంటనే ఏదైనా పిచ్చాస్పత్రికి వీలైనంత త్వరగా తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులను కోరుతున్నారు. అసహనంతో ఉన్న అతను.. తన చుట్టూ ఉన్నవారిని కరవడం మొదలుపెడతాడేమో. త్వరగా కోలుకో 'చీఫ్ మినిస్టర్'అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# రైతులే తెలంగాణ ఆత్మ



తరవాయి భాగం

ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళన మధ్య గవర్నర్ ప్రసంగం కొనసాగింది. గవర్నర్ ప్రసంగం అనంతరం అసెంబ్లీని గురువారానికి వాయిదా వేశారు

**ఘనమైన సంస్కృతికి నిలయం...**

ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారని గుర్తు చేశారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నామన్నారు.

**అభివృద్ధి వైపు తెలంగాణ అడుగులు**

అభివృద్ధి, ప్రగతి వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ అన్నారు. రాష్ట్రానికి రైతులే ఆత్మ వంటి వారు అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని చెప్పారు. దేశంలో అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. ఇదే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. 23.35 లక్షల మంది కర్షకులకు ప్రయోజనం కల్పించామని అన్నారు. ఎకరానికి రూ.12 వేల చొప్పున వారికి అందిస్తున్నామన్నారు. రైతు నేస్తం అమలు చేస్తున్నామన్నారు. సన్నాలు పండించే వరి పంటకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. అన్నదాతల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. పాడి రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని,

**మహిళలకు ఆర్థిక స్వావలంబన**

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం గేమ్ ఛేంజర్‌గా మారిందని గవర్నర్ అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు రూ.5వేల కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. ఆర్టీసీకి ఆరు వందల బస్సులు అద్దెకు ఇచ్చే విధంగా మహిళలను ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. పేదలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తన ప్రసంగంలో పేర్కొన్నారు. రుణమాఫీ కోసం ఏకంగా రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామని, రూ. 500కే గ్యాస్ అందజేస్తున్నట్లు తెలిపారు.

**యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు**

యువత ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిందని వివరించారు. శ్రీశైలం - సాగర్ హైవే మధ్యలో ఉన్న ప్రాంతాన్ని దీనికి కేటాయించామన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని, మెట్రో రైలు సౌకర్యం కూడా రాబోతుందని తెలిపారు. విద్యా రంగాన్ని కీలక బాధ్యతగా తీసుకుని ముందుకు సాగుతోందన్నారు.

**సామాజిక న్యాయానికి కట్టుబడిన ప్రభుత్వం**

రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ అన్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం కుల గణనను నిర్వహించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై నివేదికకు కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని, దీని ఆధారంగా ఉద్యోగాల భర్తీ విషయంలో పారదర్శకతను పాటిస్తున్నామన్నారు. ఇందుకోసం టీజీపీఎస్సీని బలోపేతం చేశామని తన ప్రసంగంలో గవర్నర్ వివరించారు.




# ఆర్ఆర్ఆర్ వరకూ హెచ్ఎండీఏ

తరవాయి భాగం

పరిధిని విస్తరిస్తామని ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ ఎండీఏ పరిధిలోకి 36 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో హెచ్ఎండీఏ పరిధి 1355 గ్రామాలు, 104 మండలాలు, 11 జిల్లాల వరకు పెరిగింది. ఇప్పటి వరకూ 7 జిల్లాల వరకు ఉన్న ఈ పరిధిలో తాజాగా 4 జిల్లాలు చేర్చడంతో మొత్తం 11 జిల్లాలకు చేరింది. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏను విస్తరించారు.

హెచ్ఎండీఏ పరిధి విస్తరణతో ప్రభుత్వం చేపట్టిన మాస్టర్ ప్లాన్ అమల్లోకి రానుంది. దీంతో హైదరాబాద్ పరిధిలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. 2031 మాస్టర్ ప్లాన్ ఇప్పటి వరకు అమల్లో ఉండగా...దీనికి మరో 25 ఏళ్లు పొడిగించే అవకాశాలు ఉన్నాయి. హెచ్ఎండీఏ విస్తరణ పెరగడంతో భూముల రేట్లలో భారీగా పెరిగే అవకాశం ఉంది. అలాగే హైదరాబాద్ సిటీ అభివృద్ధి కూడా ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించనుంది. గత పదేళ్లుగా హైదరాబాద్ సిటీ విస్తరిస్తూ వచ్చింది. దీంతో శివారుల్లోని భూములకు రెక్కలొచ్చాయి.ప్రభుత్వ తాజా నిర్ణయంతో నగర శివారుల్లోని భూముల ధరలు అమాంతం పెరగనున్నాయి. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో చేరిన 16 మండలాల్లో భూముల ధరలకు రెక్కలొస్తాయి. ప్రభుత్వ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ మళ్లీ పుంజుకోనుంది.

# అసెంబ్లీకి హాజరైన కేసీఆర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ 45 నిమిషాల ముందే అసెంబ్లీకి వచ్చారు. ఉదయం 10.15 గంటలకు అసెంబ్లీ మెయిన్ గేటు వద్దకు చేరుకోగా, పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కాగా, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. బీఆర్ఎస్ఎల్పీ చాంబర్‌లో కేసీఆర్‌ను కలుసుకున్నారు. తన సోదరుడి కుటుంబంలో జరిగే పెళ్లికి హాజరు కావాలంటూ ఆహ్వాన పత్రిక అందజేశారు. అయితే ఇప్పటికే నియోజకవర్గంలో మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆయన కేసీఆర్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**చర్చనీయాంశంగా కేసీఆర్ తీరు..**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. బుధవారం (మార్చి 12) ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలకు హాజరైన కేసీఆర్.. ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన వెంటనే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా కీలకమైన బీఏసీ సమావేశానికి హాజరు కావాల్సిన కేసీఆర్ ముఖం చాటేశారు. బీఏసీ సమావేశానికి హాజరు కాకుండానే.. గవర్నర్ ప్రసంగం తర్వాత అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు.

బీఏసీ సమావేశానికి కేసీఆర్ డుమ్మా కొట్టడంతో బీఆర్ఎస్ పార్టీ తరుపున మాజీ మంత్రులు హరీష్‌రావు, ప్రశాంత్ రెడ్డి బీఏసీ మీటింగ్‌కు హాజరయ్యారు. ముఖ్యమైన బీఏసీ సమావేశానికి కేసీఆర్ గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేసీఆర్ ఇలా వచ్చి.. అలా తూతు మంత్రంగా వెళ్లడంపై కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక కేసీఆర్ కేవలం మూడే సార్లు అసెంబ్లీకి హాజరయ్యారు.



# అడవులు సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని

**పినపాక, విశాలభారతి:**
అడవులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిదని ప్రతి పౌరుడు బాధ్యతగా అడవులను కాపాడుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని కోరారు. బుధవారం పినపాక మండలం, కరక గూడెం మండలంలోని పలు ఆదివాసి గ్రామాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా చెట్లను నరికి పోడు చేయకూడదన్నారు. వన్యప్రా నులను కాపాడుకోవాలని, వన్యప్రాణుల వేట చేయవద్దని సూచించారు. అడవిలో నిప్పు పెట్టకూడదని అడవికి నిప్పు అడవులకే కాక వన్యప్రాణులకు ముప్పు తెస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు. ఎవరైనా అడవులకు హాని కలిగిస్తే అటవీ శాఖ వారికీ తెలియపర్చి సమాజ శ్రేయస్సుకు, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. నేటి తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలని ప్రతిజ్ఞ చేయించారు. అడవులు ఉంటేనే సకాలం లో వర్షాలు పడతాయాని, భూగర్భజలాలు పెరుగుతాయాని, స్వచమైన త్రాగునీరు లభిస్తుందని, మంచి ప్రాణవయువు లభించాలంటే పచ్చదనం ఆవశ్యకత ఉందని అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సూరయ్య, ఏడుకొండలు, రాందాసు, బీట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే తమ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి



**గరిడేపల్లి, విశాలభారతి:**
విద్యార్థులు తమ ఉన్నత లక్ష్యాన్ని విద్యార్థి దశలోనే ఏర్పరుచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు కొణతం సుజాత వెంకటరెడ్డి అన్నారు. గరిడేపల్లిలోని చైతన్య ఇంగ్లీష్ మీడియా స్కూల్ యందు స్వపరిపాలన దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్దార్ నాయక్, పద్మ, రజని, రాధిక, శ్రీలత, భవాని, సుజాత పాల్గొన్నారు.

# ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మణుగూరు మండల అధ్యక్షులు సోలం హరి శంకర్



**మణుగూరు, విశాలభారతి:**
గిరిజన మహిళా సొసైటీ ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించాలని, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మణుగూరు మండల అధ్యక్షులు సోలం హరి శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుదవారం నాడు ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం అయినా మణుగూరు మండలంలో గల ఆదివాసీ మహిళ సొసైటీ ఇసుక ర్యాంపలను తక్షణమే పునః ప్రారంభించాలని .ఆదివాసీ ప్రజల ఉపాధిని దెబ్బకొట్టేందుకు ఇసుక ర్యాంప్ లను నిలిపి ప్రజా పాలకులు రైజింగ్ కాంట్రాక్టర్లతో బేరసారాలకు తెర లేపారని ఆరోపించారు.నిజంగా ఆదివాసీ సమాజాన్ని అభివృద్ధి పథంలో నడపాలనే ఆలోచన ప్రజా పాలకులకు ఉంటే రైజింగ్ కాంట్రాక్టర్ విధానం లేకుండా ప్రతి గిరిజన మహిళ సొసైటీ ఇసుక ర్యాంప్ కు ముందస్తుగా ఆర్థిక పెట్టిబడి నిధులు ప్రభుత్వం ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు.అమ్మ పెట్టదు అడుక్కతీననివ్వదు అనే విధంగా గా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం సరళి తయారైందని విమర్శించారు.ఇసుక అక్రమాలు కట్టడి అంటూ తెలంగాణ ప్రభుత్వం డ్రామాలకు తెరలేపారని మండిపడ్డారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మడి రమేష్, మండల కార్యదర్శులు కంగాల ప్రవీణ్, గోగ్గెలా కోటి, గణి బోయిన రాము, మడకం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడికి సన్మానం

- ఘనంగా సన్మానించిన మణుగూరు నేతాజీ వాకర్స్ టీమ్

**మణుగూరు, విశాలభారతి:**
జాతీయ స్థాయి అథ్లెటిక్ క్రీడాకారుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం మారాయి గూడెం గ్రామానికి చెందిన అపక సతీష్ కి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరు లో మార్చి 4 నుండి 9 వరకు మాస్టర్స్ అథ్లెటిక్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏం ఏ ఎఫ్ ఐ ) ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్ పోటీలో 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో మూడవ స్థాయిలో నిలిచి కాంస్య పతకం గెలిపొందడం జరిగింది.మణుగూరుకి చెందిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ వాకర్స్ టీమ్ సభ్యులు ఫిబ్రవరి 23 న అపక సతీష్ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని బెంగుళూరు వెళ్ళడానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినందుకు గాను కృతజ్ఞతతో మణుగూరు వచ్చి వారిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ వాకర్స్ టీమ్ సభ్యులు శ్రీ భార్గవ ఆటోమొబైల్స్ హీరో షో రూమ్ అధినేత ఎన్. విజయ భాస్కర్ రెడ్డి, బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో అపక సతీష్ కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ వాకర్స్ టీమ్ సబ్యులు సామ శ్రీనివాసరెడ్డి, వడ్డాణం రమేష్,జొన్నలగడ్డ వెంకటేశ్వరావు, శంకర్ రెడ్డి,వాగబోయిన నాగేశ్వరరావు, శంకర్,వంగా సంతోష్,కాంపాటి ప్రసాద్,కొరిమిల్ల శ్రీనివాస్,కనుకు రమేష్,ఆర్,సుమన్,రామిరెడ్డి,అలవాల రాంబాబు,అమర కిరణ్,కాంట్రాక్టర్ రామకృష్ణ, బాబురావు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఇష్టంతో చదవాలి

- పాలకీడు ఎంఈఓ ఇంజమూరి కాటయ్య

**పాలకీడు, విశాలభారతి:**
విద్యార్థులు కష్టంతో కాకుండా,ఇష్టపడి చదవాలని పాలకీడు ఎంఈఓ ఇంజమూరి కాటయ్య అన్నారు. పాలకవీడు పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నర్సింగ్ నరేష్ పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామాగ్రిని అందజేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో విద్యార్థులు వారు అనుకున్న రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయుడు నరేష్ ను ఎంఈఓ కాటయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ ,స్వప్న, శ్రీనివాస్ రెడ్డి, సైదులు, నాగేశ్వరరావు, సుభాషిని, రెహమతున్నీసా, నాగరాజు తదితరులు

# కేటీఆర్‌ను బట్టలూడదీసి కొడతారు..

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కేటీఆర్‌కు అధికారం పోయి రోడ్డుమీద పడ్డా అహంకారం తగ్గలేదని.. కాంగ్రెస్ తల్లి, రాహుల్ గాంధీ తండ్రి విగ్రహాలను ప్యాక్ చేస్తామంటూ కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే విగ్రహాలపై చేయి వేసి చూడు కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగాన్ని అవమానపరిచే విధంగా కేటీఆర్ మాట్లాడ్డం ఆయన అహంకారానికి పరాకాష్ట అన్నారు. గవర్నర్‌కు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గవర్నర్లను అవమానించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదంటూ విమర్శించారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడి కాంగ్రెస్ కార్యకర్తల సహనాన్ని పరీక్షించొద్దని సూచించారు.రైతు రుణ మాఫీ లెక్కలు తెలియకుండా కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల అమలు తీరు తెలుస్తుందన్నారు. కేసీఆర్ కుటుంబం గొప్పగా చెప్పుకుంటున్న కాళేశ్వరం, మేడిగడ్డ నాణ్యత ఏంటో బయటపడినా మళ్లీ వాటి గురించి మాట్లాడడం కేటీఆర్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతికి కాళేశ్వరం ఒక ఏటీఎంలా ఉపయోగపడిందన్నారు. కులగణనలో తప్పుడు లెక్కలు చెబుతున్నామని అంటున్న మీరు సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పదేళ్లుగా అధికారంలో ఉన్నా ఎందుకు బహిర్గతం చేయలేదు..? అని నిలదీశారు. కేసీఆర్ ఇప్పటికైనా ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్న ఆయన, ప్రభుత్వానికి సలహాలు సూచనలు చేస్తే బెటర్ అన్నారు.రైతు ఆత్మహత్యల గురించి కేటీఆర్ మాట్లాడటానికి సిగ్గుండాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉండేదని.. బీఆర్ఎస్ పాలనలో రైతన్నలు వరికుప్పల మీద పడి చనిపోయిన ఘటనలు ఇంకా కళ్ళముందే కదలాడుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్లు దండుకుందని ఆరోపించారు. కుల గణన సర్వేలో పాల్గొనకుండా సర్వేను తప్పు పట్టే అర్హత కేటీఆర్‌కు లేదని తేల్చి చెప్పారు. చారిత్రాత్మక నిర్ణయాలైన కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేసినందుకు అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడానికి సిగ్గుండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతోందన్నారు. పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిన సన్నాసులు ఎవరో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకో కేటీఆర్ అన్నారు. మీరు చేసిన అప్పులకే వడ్డీలు చెల్లించడానికి మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు.

# స్ట్రెచర్ ఎక్కారు.. ఇక మార్చురీకే

**తరవాయి భాగం**
పటిష్ఠంగా ఉంటే.. లక్ష కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం జరిగిపోయిందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన 1532 మంది అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రాష్ట్రానికి ఆర్థిక క్యాన్సర్‌ను ఇచ్చి వెళ్లారు. అది రోజురోజుకూ ముదురుతుంటే సిక్స్ ప్యాక్ ఉందని, కండలున్నాయని ఎన్నాళ్లు అబద్ధాలు చెప్పాలి? నేను ఉన్నది ఉన్నట్లు చెబుతుంటే 'రాష్ట్రం పరువు తీస్తున్నావు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రచారం చేస్తున్నావు. వెంటనే దిగిపో' అంటున్నారు. ఎందుకంత అసహనం? వారి ఫామ్‌హౌస్ ఏమైనా లాక్కున్నానా? ప్రజలే ఆయన్ని కిందకి గుంజేసి... నాకు అధికారాన్ని ఇచ్చారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన ఆయన నన్ను అప్పుడే దిగిపోవాలని ఎలా అంటారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపబోనని, వాస్తవాలను చెప్పి తెలంగాణను ప్రగతిపథంలోకి నడిపించడానికి కృషి చేస్తానని స్పష్టంచేశారు.

కొత్తగా ఎంపికైనా వారికి ఇప్పుడు ఉద్యోగాలిచ్చాం. వెంటనే దిగిపోండని అంటే మీరు ఊరుకుంటారా? అని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించాలని మీరు మమ్మల్ని ఆశీర్వదించారని.. కేసీఆర్ మాత్రం 10 నెలలకే దిగిపోవాలని అంటున్నారన్నారు. నన్ను పనిచేయనివ్వాలి కదా... పదేళ్లలో ఆయన సరిగా పనిచేసుంటే నాకు అవకాశమే వచ్చేది కాదు కదా అని సెటైర్లు వేశారు. ఆయన వదిలేసిన ఎస్ఎల్‌బీసీని మేం పూర్తి చేస్తుంటేనే కదా... దుర్ఘటన జరిగింది. ఆయన రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపడితే కట్టుడు... కూలుడు అయిపోయింది. అయినా, మాపై కేసీఆర్ కుటుంబమంతా ఫ్యామిలీ ప్యాకేజీలా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు... తప్పులు మాత్రమేనన్నారు. రూ.ఏడు లక్షల కోట్ల అప్పులను నజరానాగా ఇచ్చివెళ్లారని.. రాష్ట్రానికి ప్రతినెలా ఆదాయం రూ.18 వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్లు వస్తోందన్నారు. అందులో ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6,500 కోట్లు, అప్పులకు రూ.6,500 కోట్లు పోతాయని... మిగిలేవి రూ.5 వేల కోట్ల నుంచి రూ.5,500 కోట్లు అనితెలిపారు. ఆ మొత్తాన్ని 2530 పథకాలకు సర్దుబాటు చేయాలని.. ఇప్పుడున్న పరిస్థితిలో... నెలకు కనీసం రూ.22 వేల కోట్లు అవసరమన్నారు. కుటుంబంలో ఆదాయం సరిపోకపోతే కొన్ని బిల్లులను ఆపేస్తుంటామని.. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వమూ రొటేషన్ చేస్తోందన్నారు. అణాపైసాతో సహా మీ ముందు పెడతా... మీరే కమిటీ వేసుకొని దేనికెంత పంచాలో చెప్పండని కొత్త ఉద్యోగులను ప్రశ్నించారు.

**ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలలు గొప్పా..?**
''ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి ఫీజు రూ.25 వేల నుంచి రూ.30 వేలు ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థిపై మేం ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చు చేస్తున్నాం. అందులో టీచర్ల జీతభత్యాలే ఎక్కువగా ఉంటాయి. విద్యావ్యయాన్ని మేం భావితరాలపై పెట్టుబడిగా భావిస్తున్నాం. అయితే ఫలితాలు కూడా సాధించుకోవాలి కదా? తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు విశ్వసించడం లేదో పరిశోధన చేయాలి కదా. విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా 55 రోజుల్లోనే 11 వేల టీచర్ల ఉద్యోగాలిచ్చాం. బదిలీలు, పదోన్నతులు కల్పించాం. రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తాం. ఇటీవలే 58 పాఠశాలల కోసం రూ.11,500 కోట్లు మంజూరు చేశాం. వచ్చే మూడేళ్లలో రూ.30 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తాం. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్స్ వర్సిటీ ప్రారంభించాం. క్రీడా అకాడమీ, క్రీడా వర్సిటీలను నెలకొల్పబోతున్నాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సంస్థల్లో చదువుకుంటే గౌరవంగా భావించేలా అధ్యాపకులు పనిచేయాలని కోరారు.

కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేశవరావు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, విద్యాశాఖ కమిషనర్ ఈవీ నరసింహారెడ్డి, ఇంటర్‌బోర్డు కంట్రోలర్ జయప్రదబాయి తదితరులు పాల్గొన్నారు.



# వానరునికి దహన సంస్కారాలు

**నూతనకల్, విశాలభారతి:**
మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వానరునికి బుధవారం ఆ గ్రామ ప్రజలు దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానరుడు ఆంజనేయ స్వామికి ప్రతిరూపమని అలాంటి వానరుడు ఎక్కడ మృతి చెందినా చూసిన వారు కచ్చితంగా దహన సంస్కారాలు నిర్వహించాలని అలా నిర్వహించినట్లయితే మహా పుణ్యం కలుగుతుందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నకరికంటి మధు, నకరికంటి శ్రవణ్,మల్లెపాక వెంకటేశు,సాయి,గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# స్టూడెంట్ ను చితక బాదిన టీచర్





బాల్కొండ,విశాలభారతి:

భీమ్‌గల్ మండలం పల్లికొండ ఉన్నత పాఠశాలలో క్లాస్ లో అల్లరి చేస్తున్నాడని అగ్రహానికి లోనైన టీచర్ స్టూడెంట్ ను విచక్షణ రహితంగా చితక బాదాడు.తల్లి,తండ్రులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లోకాయి నవీన్ కుమారుడు లోకాయి రిషి సెవెన్త్ క్లాస్ చదువుతున్నాడు. పాఠశా లలో ఫీజికల్ సైన్స్ చెబుతున్న టీచర్ తన క్లాస్ లో అల్లరి చేస్తున్నాడని రిషిని తీవ్రంగా కొట్టాడు.తీవ్ర గాయల పాలైన స్టూడెంట్ ఇంటికి వెల్లి తల్లి, తండ్రులకు విషయం చెప్పడంతో గాయలపాలైన రిషిని భీమ్‌గల్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.తన కుమారుడిని కొట్టిన సంగతి స్థానిక ఎంఈవో డీ.స్వామి కి పిర్యాదు చేసినట్టు తెలిపారు.

## విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు పై చర్యలు తీసుకోవాలి



బాల్కొండ,విశాలభారతి:

భీమ్‌గల్ మండలం పల్లికొండ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఏడో తరగతి విద్యార్థి లోకాయి రిషిత్ క్లాస్ రూమ్లో అల్లరి చేస్తున్నాడని ఆగ్రహానికి గురైన ఉపాధ్యాయుడు విద్యార్థి రిషిత్ ను వివక్షణ రహితంగా చితకబాదాడని జిల్లా ఎన్ఎస్యుఐ ఉపాధ్యక్షుడు సయ్యద్ రహ్మాన్ అన్నారు.ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ మండల విద్యాశాఖ అధికారి డి.స్వామితో ఫోన్ లో మాట్లాడి ఉపాధ్యాయుడుపై చర్యలు తీసుకోవాలని అన్నారు.తీసుకొని యెడల పాఠశాలలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



# సింగరాజు పల్లిలో ఎర్రబెల్లి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

దేవరుప్పల, విశాలభారతి:

మండల సింగరాజుపల్లి కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేడు తన పెళ్లిరోజు సందర్భంగా కేక్ కట్ చేయగా కేకును తినిపించి శుభాకాంక్షలు తెలిపిన మండల బిఆర్ఎస్ శ్రేణులు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్ రెడ్డి, మేకపోతుల. నరసింహ్మా, ఏఎంసీ డైరెక్టర్ కూతాటి. నరసింహ, మైదాన్ జోగేశ్వర్ అన్నారపు స్వరూప యాదగిరి, కత్తుల సోమిరెడ్డి వంగ.అర్జున్, గోపాల్ దాస్ మల్లేష్, కొండ. చిన్నబుచ్చిరెడ్డి, జోగు. సోమరాజు, కాముని నరసింహులు, చింతకింది మహేష్, మేకపోతుల వెంకటేశ్వర్లు,మండల యూత్ అధ్యక్షుడు బాణోత్ నవీన్ నాయక్,పార్టీనాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.



# యశస్విని, ఝాన్సీ రెడ్డిల పై అసంతృప్తి చెందడం పద్ధతి కాదు

దేవరుప్పల, విశాలభారతి:

మండలం సింగరాజుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేసుకొని ఎంఎల్ఎ మామిడాల యశస్విని రెడ్డి,మరియు ఝాన్సీ రెడ్డి లపై కార్యకర్త అసంతృప్తి తో విమర్శించడం, సమంజసం కాదు అని, గ్రామ కమిటీ అధ్యక్షులు కొండ పెద్ద మల్లారెడ్డి అన్నారు. ఈ సమావేశం సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కార్యకర్తలు ప్రతి పార్టీ పనితనం చూసుకుంటూ వస్తున్నాము, ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు అయిన కొద్ది రోజులకే పార్టీపై అసంతృప్తికరమైన భావన సరి అయినది కాదని, పృథ్వీ రెడ్డి, పార్టీ కార్యకర్తలను అనుసరించకుండా ఇలాంటి వాయిస్ వీడియోలు చేయడం ఈ యొక్క సంఘటన కాంగ్రెస్ పార్టీ కమిటీ మెంబర్స్ ఖండిస్తూ అందరికి ఇలా చేయడం బాధాకరంగా ఉంది అన్నారు. మా గ్రామ కమిటీ ఎంఎల్ఎ యశశ్విని రెడ్డి మరియు ఝాన్సీ రెడ్డి లు ప్రజలకు అనుగుణంగా ఉంటూ ప్రజలకు చేస్తున్న సేవలు పనితీరును ఏకీభవిస్తూ వారి అనుసంధానంలో మేము మా కమిటీ ఎల్లవేళలా కలిసి వారితోపని చేస్తామని ఈ సందర్భంగా అన్నారు. ఈ సమావేశంలో నల్ల యాదగిరి, కొంగరి రాములు, కొండ చిన్న మల్లారెడ్డి,వడ్లకొండ సోమయ్య, మట్ట రాములు, అటికం ఎల్లయ్య, నర్సయ్య, మంగ.సారయ్య, జోగు శ్రీశైలం, నల్ల నర్సయ్య, జోగు నర్సయ్య, తాళ్ల పెల్లి బిక్షపతి, అటికం సంపత్, జోగు సోమరాజు, ఊట్ల రవీందర్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక

దేవరుప్పల, విశాలభారతి:

ఈ నెల 14 శుక్రవారం హోళీ పండుగ రోజున జరగనున్న శ్రీ వానకొండయ్య లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవానికి రావాలని పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి,నియోజక వర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను హైద్రాబాద్ లోని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేసిన దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామ ఆలయ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో కడవెండి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నూరు రాంబాబు,ఆలయ పూజారి సంపత్,దేవాదాయ కమిటీ చైర్మన్ పెద్ది రమేష్,సభ్యులు గంగరబోయిన మల్లయ్య,యాదయ్య,వెంకన్న,ఎల్లయ్య,యాదగిరి,కిష్టయ్య,కొమురయ్య,రమేశ్,యాకుబ్ పాష, శ్రీనివాస్,భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

# పొలిశెట్టి గుట్టపై సమ్మక్కసారక్క బద్దిపోశమ్మ దేవతల జాతర

- తోలేం వంశీయులచే ఐదు రోజులపాటు ఘనంగా జాతర
- ముఖ్యఅతిథిగా ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ



పినపాక, విశాలభారతి :

ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ కి మేళ తాళాలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికిన దేవనగరం గ్రామం తోలెం వంశీయులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దేవనగరం గ్రామంలో పోలిశెట్టి గట్టు పై వెలసిన శ్రీ సమ్మక్క సారలమ్మ , బద్ది పోచమ్మ జాతర ఏర్పాట్లు ఘనంగా చేశారు. చుంచు రామకృష్ణ గత నాలుగు వందల సంవత్సరాలుగా నాలుగో తరం వారసులు తోలెం వంశీయులచే ఆనవాయితీగా పూజలు అందుకుంటున్న తల్లులను దర్శించుకొని పసుపు కుంకుమ, పట్టు వస్త్రాలు,గాజులు సమర్పించారు. ఈ సందర్భంగా చుంచు రామకృష్ణ మాట్లాడుతూ ఆదివాసీలు ఈ దేశ మూలవాసులని ఆదివాసీలు అంటేనే సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరని , ఆదివాసీలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, తెలంగాణ వ్యాప్తంగా జాతరల నిర్వహణ గురించి శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు విషయం తెలియజేశామని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా కలిసి విన్నవిస్తామని జాతరలకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరించాలని అలాగే పూజారులకు వడ్డెలకు తలపతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందించాలని, తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కనుమరుగైపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, చాలా ప్రాంతాల్లో జాతర నిర్వహణ భారం అవటం వలన అనేక చోట్ల జాతరలు కనుమరుగైపోతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవరబాల తోలెం నాగయ్య , పూజారి తోలెం సత్యమ్మ, వడ్డే మద్దెల పటేల్ , ఆలయ కమిటి, తలపతులు, తోలెం రాంబాబు, శ్రీను, రవీందర్, జనార్ధన్ రావు, గోవర్ధన్ రావు, ఎడిల్ల ప్రసాద్ మనీ, సరిత, వాణి, అనూష, సునీషా, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ చెల్లింపులపై అవగాహన సదస్సు

గరిడేపల్లి, విశాలభారతి:

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సర్వారం గ్రామంలో డిజిటల్ లావాదేవుల పై ఆహ్వాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనేజర్ మల్లికార్జున్ ప్రతి ఒక్కరు బ్యాంకులో పొదుపు చేసుకోవాలని ప్రధానమంత్రి యోజన స్కీమ్లో చేరాలని సెల్ఫోన్లో వచ్చే మెసేజ్ లపై మోసపోకుండా ఓటిపిలు చెప్పకుండా ఉండాలని ఫోన్ పే గూగుల్ పే లో తగు జాగ్రత్త వహించాలని కోరారు. సైబర్ క్రైమ్ లో చాలా జరుగుతున్నది ఇట్టి విషయం పైన తగు జాగ్రత్తగా ఉండాలని ఖాతాదారులు కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున్ ఫీల్డ్ ఆఫీసర్ సాయినాథ్, ఎఫ్ ఐ సీ నోడల్ అధికారి రాజశేఖర్, జగదీష్ పలువురు ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మండల స్థాయి అధికారులతో ములుగు కలెక్టర్ సమావేశం

- ప్రతి గ్రామానికి మంచినీరు అందించే బాధ్యత అధికారులదే - జిల్లా కలెక్టర్ దివాకర్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని కలెక్టర్ కు వినతిపత్రం

వాజేడు, విశాలభారతి:

మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద ములుగు జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులను ఉద్దేశించి ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ.. వాజేడు మండల పరిధి గ్రామాలలో మంచినీటి సమస్య ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు. కృష్ణాపురం, శ్రీరామ్ నగర్ , కొంగల గ్రామ పంచాయితీలలో మంచినీటి సమస్య ఎండాకాలంలో ఏర్పడుతుందని కరెంటు సమస్య ఉందని మండల పరిషత్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి విక్రాంత్ మండల పరిధి గ్రామాల్లో చెరుకూరు నుండి ధర్మారం, మురుమూరు నుండి బొమ్మనపల్లి,కడేకల్ నుండి ధర్మారం గ్రామాలకు ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి రోడ్డు సౌకర్యం కల్పించాలని రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు . మండల స్థాయి జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సౌకర్యం కల్పించాలని వినతి పత్రాన్ని అందజేయగా ములుగు కలెక్టర్ దివాకర్ స్పందిస్తూ మీ మీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ మిశ్రా ఏటూరు నాగారం, డిఆర్డిఓ సంపత్ కుమార్, డిసిఓ సర్దార్ సింగ్, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విజయ, ఎం పి ఓ శ్రీకాంత్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, వాజేడు మాజీ సర్పంచ్ తల్లాడి ఆదినారాయణ, పూణెం రాంబాబు, చెన్నం ఎల్లయ్య, వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

# ఆర్టీఐ ఏఎఫ్ మండల అధ్యక్షుడిగా మిడిసినమెట్ల సతీష్



నేరేడుచర్ల, విశాలభారతి:

సమాచార హక్కు చట్టం ఆక్టీవిస్ట్స్ ఫోరమ్ నేరేడుచర్ల మండలం అధ్యక్షులు గా మిడిసినమెట్ల సతీష్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ,ప్రధాన కార్యదర్శి జానకిరామ్ సూచనల మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని, సహా చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.



# డిజిటల్ క్లాస్ రూమ్లను ప్రారంభించిన తీగల నర్సిరెడ్డి

పాలకీడు, విశాలభారతి:

మండలంలో డిజిటల్ క్లాస్ రూమ్లను ప్రారంభించిన తీగల నర్సిరెడ్డి. బుధవారం ఎల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పారిశ్రామికవేత్త అయినా తీగల నర్సిరెడ్డి పద్మారెడ్డి దంపతులు 1,50,000 విలువగల డిజిటల్ క్లాస్ రూమ్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి విచ్చేసి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ఎటువంటి సహాయం చేయడానికి అయినా నేను ఎప్పుడూ సిద్ధమే అని, పేద విద్యార్థులు గొప్పగా చదువుకొని,భావి భారత పౌరులుగా ఎదిగి, మన ఉన్న ఊరికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలకు ఇంత చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తీగల నర్సిరెడ్డి ని గ్రామంలోని యువత సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంఈఓ ఇంజమురి కాటయ్య, పాఠశాల ప్రిన్సిపల్ యుసూఫ్,ధర్మ,వెంకట్ రెడ్డి, శ్రీలత,పెరుమళ్ళ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# మేమున్నామంటూ ధైర్యం చెప్పిన తోటి ఉద్యోగులు

మణుగూరు, విశాలభారతి:

మణుగూరు సింగరేణి ఏరియాలో ఎస్ఎంపిసి ఎంఎంఏ ప్రైవేట్ సెక్యూరిటీలో సెక్యూరిటీ సుమారు ఏడు సంవత్సరాలు విధులు నిర్వహించిన సతీష్ అనారోగ్యం కారణంగా తానంతట తానుగా ఉద్యోగం నుండి వైదొలగారు. తోటి కార్మికుడిని ఆర్థికంగా ఆదుకోవాలన్న దృక్పథంతో, సెక్యూరిటీ గార్డులు 32 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి శాలువాతో సత్కరించారు. సెక్యూరిటీ సూపర్వైజర్ రాముతార్, సుధాకర్ లు మాట్లాడుతూ టీ సతీష్ ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల వైదొలగడం మాకు బాధాకరమైన విషయమన్నారు.ఈ కార్యక్రమంలో సుధీర్, వి శ్రీనివాసరావు,గుత్తుల శ్రీను, శేఖర్ బాబు,యాకూబ్ పాషా, జై నరసింహ,ప్రవీణ్, వెంకటేశ్వర్లు, సాయిరాం, సంతోష్, రాజశేఖర్,శ్రీను,ఎన్ సుధాకర్, రాజనర్స్, పిరవి,టి శంకర్,రఘు,బాలకృష్ణ, డి ప్రేమ్ కుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
13.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## ఎంఎల్ సి ఎంపికలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం హర్షనీయం

▸ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట,విశాలభారతి:** సామాజిక న్యాయం పాటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ్యుల కోటాలో నలుగురు ఎమ్మెల్సీలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మిత్రపక్ష పార్టీ అయిన సిపిఐ కి ఒక ఎమ్మెల్సీ ని కేటాయించడం హర్షణీయమని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి బీసీ కులానికి చెందిన వ్యక్తి అయ్యుండి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ లు సామాజిక న్యాయం పాటించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు కావస్తున్న సింహభాగం ఉన్న బీసీలకు న్యాయం జరగడం లేదని అన్నారు. ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ సాహసోపేత నిర్ణయం తీసుకొని ఏ రాష్ట్రంలో జరిగిన విధంగా తెలంగాణలో కులగణన చేపట్టడం చారిత్రాత్మకమన్నారు. బిఆర్ఎస్ పార్టీ సైతం ఎమ్మెల్సీ ని బీసీకి కేటాయించక తప్పలేదు అన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకే ప్రాముఖ్యతను ఇచ్చారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని పాటిస్తూ అమలు చేస్తుందన్నారు. 2011లో జనగణన జరిగిందని, కేంద్ర ప్రభుత్వం 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు జనగణ చేపట్ట లేదని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ ను అమలు చేస్తుందని అన్నారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి అధ్యక్షునిగా సామాజిక వర్గానికి చెందిన మల్లికార్జున్ ఖర్గేని, తెలంగాణ రాష్ట్రంలో టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ సముచితమైన న్యాయం చేసిందని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి, బీసీలకు సముచితమైన ప్రాధాన్యత కల్పించడంలో డైలమాలో ఉన్నాయన్నారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, మాజీ కౌన్సిలర్లు షఫీ ఉల్లా, నిమ్మల వెంకన్న, జ్యోతి కరుణాకర్, యాట వెంకన్న, కర్ణాకర్,ధర్మా, తదితరులు పాల్గొన్నారు

## రుద్రాక్షలు పంపిణీ

**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండల కేంద్రంలో బుధవారం రాజ్ నగర్ ప్రవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు రుద్రాక్షలను యువ నాయకులు గాండ్ల సంతోష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శివరాత్రి సందర్భంగా మంగి రాములు మహారాజ్ పల్గుట్ట ఆవరణలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రుద్రాక్షలను ప్రతి ఒక్కరికి చేరాలనే ఉద్దేశంతో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరజి రాజ్ కుమార్,నితిన్, వెదన్ష్,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**చిట్యాల, విశాలభారతి:** విద్యార్థులను చైతన్యవంతులను చేసేందుకే స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎస్.వీ.ఎం పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్, ప్రిన్సిపల్ బొడిగె విజయ్ కుమార్ పేర్కొన్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్ (ఎస్.వీ.ఎం) పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఒకరోజు అధికారులు, రాజకీయ నాయకులు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులుగా తమ హావభావాలతో అలరించి మెప్పించారు. ప్రిన్సిపల్ గా కొండ విన్ని, వైస్ ప్రిన్సిపాల్ గా బోగ ఆనంది, జిల్లా పాలనాధికారిగా మెట్టు వర్షిత, విద్యాశాఖ మంత్రిగా రుద్రారపు శివసాయి, జడ్పీ చైర్మన్ గా కొండ విశ్వసాయి, జిల్లా విద్యాధికారిగా ఆకుల శ్రీనాథ్, జిల్లా ఉప విద్యాధికారిగా ఆవుల మత్స్యగిరి, మండల విద్యాధికారిగా మెట్టు యశ్వంత్ తమ విధులను నిర్వర్తించి పాఠశాల, తరగతుల నిర్వహణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడిగె రాణి, రుద్రారపు లావణ్య, ఈరమల్ల లూసిక, మునుకుంట్ల వేణు, మునుకుంట్ల స్వాతి, బెల్లంకొండ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.






## సాగునీటి సమస్యకు గత బిఆర్ఎస్ ప్రభుత్వమే

**తొర్రూరు, విశాలభారతి:** సాగునీటి సమస్యలు తలెత్తి మా పొలాలు ఎండిపోవడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సోమవరపుకుంట తండాకు చెందిన రైతులు వాపోయారు. సోమవరపుకుంట తండా రైతులు మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాంట్రాక్టర్ల దగ్గర డబ్బులు తీసుకొని చెక్ డ్యాముల నాణ్యత లోపంగా నిర్మించారని,ఆ చెక్ డ్యాములు నాణ్యత లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయాయని వాపోయారు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డిలు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి సాగునీరు అందేలా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు.




## మూడో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

▸ వర్గీకరణ చట్టంపై ప్రభుత్వం ద్వంద వైఖరి

**విశాలభారతి,భీమదేవరపల్లి :** ప్రభుత్వం షెడ్యూల్ కులాల వర్గీకరణ చట్టం చేస్తామని ఒకవైపు చెప్తూ, వర్గీకరణ లేకుండా పరీక్ష ఫలితాలు విడుదల చెయ్యడమంటే మాదిగలను మోసం చెయ్యడమేనని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తూ, ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలో తెలంగాణ అంబేద్కర్ సంఘ నాయకులు కండె సుధాకర్, తందూరి ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కండే రమేష్, కండె చక్రపాణి, కదారి బాబు, బీసీ సంఘం నాయకులు వేముల జగదీష్, తాడూరి చిరంజీవి, మండల అధ్యక్షుడు కదారి ప్రభాస్, తాళ్లపల్లి ఆశీర్వాదం, అంబాల బక్క రాజు, పాపక్క వేల్పుల, కొమరమ్మ, వేల్పుల లక్ష్మి, నాగిన్ల ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## చిగురుమామిడి కళాకారుల గ్రామ కమిటీ ఎన్నిక

▸ సంస్కృతికి ప్రతిరూపాలు కళాకారులు: రాజ్ కుమార్

**చిగురుమామిడి,విశాలభారతి:** తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి చందబోయిన పరశురాములుతో కలిసి చిగురుమామిడిలో నూతన కళాకారుల గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షునిగా నిలిగొండ కిషన్, అధ్యక్షులుగా చొప్పదండి సుధాకర్, ఉపాధ్యక్షులుగా పెనుకుల తిరుపతి, మల్లం బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లం శ్రీనివాస్, కోశాధికారిగా పోలోజు రమేష్, సహాయ కార్యదర్శులుగా పోలోజు కుమారస్వామి, నిలిగొండ సదానందం, వంగ సదానందం, సంయుక్త కార్యదర్శులుగా అనువోజు బాలకృష్ణమాచారి, చొప్పదండి ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా నిలిగొండ వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా మల్లం నరసయ్య, పెనుకుల రాజయ్య, కుతాడి కొమరయ్య, పొగాకుల రమేష్, చెరుకు రమేష్, నిలిగొండ శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల అధ్యక్షుడు రాజ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల సంస్థ నుండి 10 సంవత్సరాలుగా ఎన్నో కార్యక్రమాలు చేస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను ఇతిహాసాలను జానపద గాథలను కళ్ళకు కట్టినట్టుగా వేషధారణతోని ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజల మనగడకు కారణభూతులైన కళాకారులకు కళాంజలిలు తెలుపుకుంటూ నూతనంగా ఎన్నికైన చిగురుమామిడి గ్రామ కళాకారుల అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.



## ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి

▸ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు - డి ఆర్ డి ఓ సంపత్ కుమార్

**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్రంలో ఈరోజు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో డి ఆర్ డి ఓ సంపత్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. వాజేడు మండల పరిధి గ్రామ పంచాయతీలలో ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలని కూలీలు ఎక్కువ మంది ఉపాధి హామీ పనులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలి, ఉపాధి హామీ సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారి పై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు 300 రూపాయలు వచ్చే విధంగా సాంకేతిక సహాయకులు మార్కింగ్ ఇయ్యాలి వాజేడు మండల పరిధి నర్సరీ యందు 500 కానుగా మొక్క పెంచాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి వెంకటనారాయణ, ఏపీవో రాజు, ఈసీ సత్తేందర్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్స్ కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.



## ఫర్టిలైజర్ల దుకాణం ఎదుట రైతుల ఆందోళన

**బాల్కొండ,విశాలభారతి:** భీమ్‌గల్ మండలంలోని గోన్ గొప్పుల గ్రామానికి చెందిన రైతులు ఆ గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణం దగ్గర ఆందోళన చేశారు.గ్రామానికి చెందిన రైతులు కావేరి, శ్రీరామ సీడ్స్ కాలి బ్యాగ్లను ఆందోళనలో ప్రదర్శించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు ఫర్టిలైజర్ యజమానులు శ్రీరామ, కావేరి కంపనీ పేరిట వరి విత్తనాలు స్థానిక రైతులకు విక్రయించడం జరిగిందన్నారు. వీటిని కొనుగోలు చేసిన రైతులు పంట చేతికి వచ్చే సమయం దాటిపోతున్నా పంట ఇంకా చేతుకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తు రైతులను నష్టపోయేలా చేసిన ఫర్టిలైజర్ షాప్స్ యజమానులు,కంపనీలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



## తిమ్మాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

▸ సింగిల్ విండో డైరెక్టర్ ముప్ప మహేందర్

**విశాలభారతి, ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో పలు సీసీ రోడ్డులకు సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పొన్నం అనూప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షుడు సంతాజి, టిపిసిసి మెంబర్ అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, హింగే శ్రీకాంత్, తాళ్లపల్లి రంజిత్, తోకల లక్ష్మారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బొక్క భాస్కర్, నాయకులు గూడెం లింగయ్య, వెల్తూరి లింగయ్య, శ్రీరాముల కృష్ణమూర్తి, మోహన్ రెడ్డి, తాళ్లపల్లి దిలీప్ గూడెం వినయ్, జట్టి భరత్, వెల్తురు చిరంజీవి, అశోక్, చంద్రగిరి కుమారస్వామి, వెల్తూరి రవి, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్షునిగా పొన్నగంటి అశోకరావు

**విశాలభారతి, ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల సమావేశానికి తండ మొండయ్య అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఊట్కూరి రాములు రైతు సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసే అంతవరకు పోరాటం ఆగదని పేర్కొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారికి కూడా రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ధరణి పోర్టల్ వలన రైతులు ఇబ్బందులు పడ్డారని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఇప్పటికీ ఆ సమస్యను పరిష్కరించలేదని వెంటనే అర్హులైన వారికి పాస్ పుస్తకాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షుడు పొన్నగంటి అశోకరావు ప్రధాన కార్యదర్శి గొట్టేముక్కుల మనోహర్రావు కోశాధికారి కుక్కల చంద్రమౌళి కార్యవర్గ సభ్యులుగా కర్రే రాజు మల్లయ్య పానుగంటి రాజిరెడ్డి తోపాటు పదిమందిని ఎన్నుకున్నారు



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
13.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ కి వివాహ పత్రికను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు,విశాలభారతి**

తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు సంతోష్ రెడ్డి వివాహం సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధ్యక్షులు శ్రీ జగన్మోహన్ రెడ్డికి పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి వివాహ పత్రికను అందజేశారు. విజయవాడ తాడేపల్లిలో గల ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వివాహ ఆహ్వానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గూడెం సందీప్ రెడ్డి పాల్గొన్నారు.




# స్త్రీలను గౌరవించడం ముఖ్యం

- అమ్మ ఒడి, చదువుకునే బడి" నుండే అలవాటు కావాలి
- ఓయూలో మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరు
- మంత్రి సీతక్క

**విశాలభారతి,ఓయూ:**

"స్త్రీలను గౌరవించడం అనేది అమ్మ ఒడి, చదువుకునే బడి" నుండే ప్రారంభం కావాలని తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆర్ట్స్ కళాశాల వేదికగా, మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 12, బుధవారం నాడు ఏర్పాటు చేసిన "ప్రమోటింగ్ విమెన్ రైట్స్, జెండర్ ఈక్వాలిటీ, ఫాస్టరింగ్ ఎంపవర్‌మెంట్" అంశం పై ఒక రోజు జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సి. కాశీం అధ్యక్షత వహించారు. విద్యార్థులు కేవలం విద్యారంగంలో మాత్రమే కాకుండా సామాజికార్థిక, రాజకీయ రంగాలలో క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. నిరంతరం సమాజం కోసం పాటు పడాలనే లక్ష్యమే వ్యక్తులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని, తాను అదే నమ్ముతానని అన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ. రాణి కుముదుని ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ మగవారితో పోలిస్తే మహిళలకు విజయాన్ని సాధించడంలో అనేక ఆటంకాలు వస్తాయని, వాటిని ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తాను ఒక మహిళగా అన్ని బాధ్యతలు నెరవేరుస్తూనే, అనేక విజయాలు అందుకున్నాని అన్నారు. మహిళలకు కుటుంబాల అండ లభిస్తే ఎంతటి లక్ష్యాన్నైనా సాధిస్తారని అన్నారు. మరొక గౌరవ అతిథిగా ఓయూ వీసీ ప్రొ. ఎం. కుమార్ మాట్లాడుతూ. విద్యార్థిని, విద్యార్థులందరూ వినడం, రాయడం, మాట్లాడటం అనే నైపుణ్యాలను అలవర్చుకొని, విద్య, ఉపాధి రంగాలలో కృషి చేయాలని సూచించారు. ఓయూ విద్యార్థుల కోసం సాధ్యమైనన్ని సదుపాయాలు కల్పించడం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేశ్, ఓయూ ఆర్ట్స్ డీన్ ప్రొ. సయిదా తలత్ సుల్తానా, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొ. సి. అరుణ జ్యోతి, ఐ.సి.ఎస్.ఎస్.ఆర్ ఓయూ డైరెక్టర్ ప్రొ. సుధాకర్ రెడ్డి, సైబర్ ఫోరమ్ జాయింట్ సెక్రటరీ టి. తంగెళ్ల ప్రవీణ్ కుమార్, సెలబ్రిటీ గెస్ట్‌గా ప్రముఖ జానపద గాయని దాస లక్ష్మి, యూజిసి డీన్ ప్రొ. బి. లావణ్య, ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కన్వీనర్ ప్రొ. వి. శ్రీలత, చైర్ పర్సన్ డా. సి. ఎస్ స్వాతి, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. కొండా నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ (హాస్టల్స్) డా. బాలు నాయక్, ప్రొఫెసర్స్, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పిజీ విద్యార్థిని, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.






ఏ ఆర్ కే హాస్పిటల్ బిల్డింగ్ మధురపురి కాలనీ, కోణార్క్ లైన్ దిల్సుఖ్నగర్ నిర్మాణం.



కోణార్క్ థియేటర్ ఎదురుగా అక్రమ నిర్మాణం.

# సరూర్ నగర్ సర్కిల్లో అక్రమాల నిర్మాణాల జోరు

- సరూర్ నగర్ సర్కిల్ -05 పిఎన్టి కాలనీలో అక్రమ నిర్మాణాల జోరు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి.
- పరిమితికి మించి నిర్మాణాలు.
- అమ్యామ్యాల మత్తు లో టౌన్ ప్లానింగ్ అధికారులు.

**ఎల్బీనగర్ విశాల భారతి:**

సరూర్ నగర్ సర్కిల్ 05 లో అక్రమ నిర్మాణాలకు అంతే లేకుండా పోతోంది. జీ+2 అనుమతులు తీసుకొని జీ+3, 4, 5, పెంట్ హౌజ్ నిర్మాణం పిఎన్టి కాలనీ, మధురపురి కాలనీ, కోణార్క్ థియేటర్ ఎదురుగా చేపడుతున్నారు. ప్రమాదమని తెలిసినా పట్టించుకునే వారు లేరు. టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఇవ్వడంతో ఒక 10 రోజులు పనులకు గ్యాప్ ఇచ్చి మళ్లీ నిర్మాణం చేపడుతున్నారు. వీటిపై ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ హేమంత్ కేశవ్ పాటిల్ వేగంగా స్పందించాలని కోరుతున్నారు సరూర్నగర్ టౌన్ ప్లానింగ్ పరిధిలో దిల్సుక్నగర్ కోణార్క్ ఎదురుగా కమర్షియల్ నిర్మాణం, పి ఎన్ టి కాలనీలో, ఏ ఆర్ కే హాస్పిటల్ బిల్డింగ్ మధురాపురి కాలనీ కోణార్క్ లైన్ దిల్సుఖ్నగర్ లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొన్ని నిర్మాణాలు అనుమతులు జీప్లస్ టూ తీసుకొని బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు రాగా, మరుసటి రోజు నామమాత్రపు కూల్చివేతలు చేస్తున్నారు. వారం పది రోజుల తర్వాత బిల్డింగ్స్ నిర్మాణాలు యథావిధిగా సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు తూతూ మంత్రంగా ఒకటి, రెండు బిల్డింగ్స్ కూల్చివేసి హడావిడి చేస్తు న్నారు. దాదాపు అక్కడ ఐదు ఆరు పైన జీప్లస్ టూ పర్మిషన్ తీసుకొని జీ ప్లస్ త్రీ, ఫోర్, ఫైవ్, పెంట్ హౌస్ కడుతున్నారు. కాగా బిల్డింగ్స్ ఓనర్స్ అందరూ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని యథేచ్ఛగా పరిమితికి మించి అక్రమ కట్టడా లను నిర్మిస్తున్నారు. అయినా అధికా రులు మాత్రం తమకు ఏమీ తెలియ నట్లుగా వ్యవరిస్తున్నారు. మున్సిపల్ అధికారులకు ఒక బిల్డింగ్కు దాదాపు రూ.1లక్ష వరకు ముడు పులు ముట్టినట్లు జోరుగా గుసగు సలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే అనుమతులకు మించి చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మా ణాల విషయంలో సరూర్నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ఒక ఇల్లు నిర్మించాలంటే ఎన్నో అనుమతులు కావాలి. కానీ ఇదంతా పేదలకు మాత్రమే బడా బాబులు నిర్మించాలంటే రూల్స్ పాటించాల్సి న అవసరం లేదు. లక్షల్లో చేతివాటం చూపితే ఎంతటి భవనాలను అయినా నిర్మించుకోవచ్చా అనే ప్రశ్నలు వెల్లువతున్నాయి. దీంతో జిహెచ్ఎంసికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. ప్రతిరోజూ టౌన్ ప్లానింగ్ అధికారులు ఫీల్డ్ ఎంక్వయిరీ అంటూ తిరుగుతూనే ఉంటారు. కానీ ఈ విషయమై అధికారులకు తెలియకుండా ఇంత జరుగుతుందా? అని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమాత్తు వీడి వెంటనే చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.




# ముత్తారంలో విద్యుత్ ఉద్యోగుల పొలం బాట

- విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు తప్పనిసరి
- ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు విజ్ఞప్తి
- హనుమకొండ రూరల్ డివిజనల్ ఇంజనీర్ సామ్యా నాయక్

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

మండలంలోని ముత్తారం గ్రామంలో విద్యుత్ ఉద్యోగులు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ రూరల్ డివిజన్ కొత్తకొండ సెక్షన్ లో గల ముత్తారంలో పంట పొలాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ సామ్యా నాయక్ మాట్లాడుతూ, రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా తమ సిబ్బంది పని చేస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు పెట్టుకోవాలని, అలాగే ఆటో స్టార్టర్లు తొలగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కెపాసిటర్లు అమర్చడం వల్ల విద్యుత్ మోటర్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని, లో వోల్టేజ్ సమస్య లేకుండా పనిచేస్తాయని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వంగిన విద్యుత్ పోల్స్ ను సరి చేయడం, విద్యుత్తు లైనులను స్టీరింగ్ చేయడం, విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి ఏడిఈ రాజేశ్వరరావు, ఏఈ శిరీష్ కుమార్, సబ్ ఇంజనీర్ సుదర్శన్, లైన్ ఇన్స్పెక్టర్లు సంపత్, దాసు, సిబ్బంది వెంకటరెడ్డి, రామకృష్ణ, అరవింద్, సంతోష్, దినేష్, రాజు కుమార్, నవీన్, సాంబయ్య, రాజిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

# పిల్లలమర్రిలో వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం

**సూర్యాపేట,విశాలభారతి:**



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు బుధవారం సాయంత్రం వైభవంగా నమ్మాళ్వార్ పరమ పదము ఘనంగా జరిగింది.అర్చకుల బృందం కన్నులు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ పిల్లలమర్రిలో గత 120 సంవత్సరాలుగా ఎంతో వైభవపేతంగా అధ్యయన బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నయని అన్నారు.బుధవారంతో అధ్యయనోత్సవాలు ముగిసి గురువారం ఉదయం నుండి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలోయాగ్నీకులు మరింగంటి వరదాచార్యులు, ధరూరి రాఘవాచార్యులు, చింతాడ రామానుజాచార్యులు,ఆలయ ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాద్ ,కమిటీ చైర్మన్ గూకంటి రాజాబాబు రెడ్డి, వైస్ చైర్మన్ మంగపండ్ల మల్లికార్జున్, కందగట్ల రాంబాబు,బంగారు కృష్ణయ్య ,బంగారి సైదమ్మ మల్లయ్య ,కోనేటి కృష్ణ , రాజు, గంపల శంకర్, కుమ్మరిగుంట్ల జానయ్య, అంకంభిక్షం, కట్టెకోల గోపాల కృష్ణరావు తదితర భక్తులు పాల్గొన్నారు.



## ఆస్తి పన్నువన్ టైం
# సెటిల్ మెంట్ రాయితీ ఇవ్వాలి

- సిపిఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్

**సూర్యాపేట,విశాలభారతి:**

గ్రేటర్ హైదరాబాద్ తరహాలో ఆస్తిపన్ను వన్ టైం సెటిల్ మెంట్ 90 శాతం వడ్డీ రాయితీ మున్సిపాలిటీలకు వెంటనే ప్రకటించాలని సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాస్ సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీతారామపురంలో జరిగిన సిపిఎం పార్టీ వన్ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 2025 సంవత్సరం సంబంధించిన ఆసిఫన్ను చెల్లించే వారి కి వడ్డీ 90 శాతం రాయితీ ఇవ్వడం ద్వారా ఇంటి పన్నులు 100 శాతం పూర్తయి మున్సిపాలిటీలకు ఆదాయం రావడానికి అవకాశం ఉందని అన్నారు. అనేక ప్రాంతాలలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని, వాటి వసుల కోసం ఈ రాయితీ స్కీమ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఒకే రాష్ట్రంలో రెండు విధానాలు ఉండకుండా జిహెచ్ఎంసి తరహాలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లకు, మున్సిపాలిటీలకు,నగర పంచాయతీలకు తొంబై శాతం ఆస్తి పన్ను వడ్డీ మాఫీ ప్రకటించి ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, కప్పల సత్యం, నగిరి జయమ్మ, పిట్టల రాణి, గంగపురి శశిరేఖ, ఒట్టే ఎర్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామైక్య సంఘ భవనానికి కృషి చేయాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునికి వినతిపత్రం ఇచ్చిన మహిళలు

**విశాలభారతి,ఎల్కతుర్తి:**



మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామైక్య సంఘ భవనానికి కృషి చేయాలని వివో అధ్యక్షురాలు బండి పుష్పనీల ఆధ్వర్యంలో మహిళలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గ్రామైక్య సంఘ భవన నిర్మాణానికి మంత్రితో మాట్లాడి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ గ్రామ మహిళలు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంతాజి, సింగల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్.ఆర్.ఎస్ క్రమబద్ధీకరణకు
# దరఖాస్తుదారుల ఉత్సాహం

- 25 శాతం రిబేటు సదుపాయాన్ని వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్.

**సూర్యాపేట,విశాలభారతి:**

ఎల్ ఆర్ ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునేందుకు స్వతహాగా ముందుకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ తేజస్ తెలిపారురాష్ట్ర ప్రభుత్వం ఎల్.ఆర్. ఎస్ ద్వారా ప్రజలకు వెసులుబాటు కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోని తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాలని కలెక్టర్ తేజస్ అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎల్ ఆర్ ఎస్ అవగాహన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు రిబేటును మినహాయిస్తూ వెంటనే ల్యాండ్ రెగ్యులైజేషన్ కు సంబంధించిన ప్రోసోడింగ్ లు జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 961 మంది ఫీజు చెల్లింపులు పూర్తి చేశారని, ఎల్ ఆర్ ఎస్ క్రింద 4 కోట్ల 88 లక్షల రూపాయలు రుసుము వసూలు అయిందని, ఈరోజు 36 మంది ఫీజు చెల్లింపు చేశారని ఎల్ఆర్ఎస్ క్రింద19,66,000 రుసుము వసూలూ అయిందని కలెక్టర్ వివరించారు. మిగతా దరఖాస్తుదారులు కూడా నిర్ణీత గడువులోపు ఎల్ ఆర్ ఎస్ చెల్లించి తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని, రిబేటు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం అన్ని మున్సిపాలిటీలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తుదారులు తమ సందేహలను హెల్ప్ డె స్కులలో సంప్రదించవచ్చని తెలిపారు. బఫర్, ఎఫ్ టి ఎల్, చెరువులు, కుంటలు వంటి నిషేధిత జాబితాలో ప్రాంతాలను మినహాయిస్తే, ఇతర ప్రాంతాలలోని ప్లాట్లకు ఆన్లైన్ లో సులభంగా అనుమతి లభిస్తుందని అన్నారు. చెరువులు నీటి వనరులకు సమీపంలో కనీసం 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరని కలెక్టర్ వెల్లడించారు. ఎల్ ఆర్ ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులు 90 శాతం రిఫండ్ అవుతుందని 10 శాతం ప్రాసెసింగ్ చార్జెస్ కింద తీసుకుంటారని అన్నారు. స్థలాల క్రమబద్ధీకరణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ,అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ స్థలాలను ఎల్. ఆర్.యస్ ఫీజులు చెల్లించినట్లయితే వెంటనే ప్రొసీడింగ్ జారీ చేస్తామని తెలిపారు. 26 8 2020 నాటి వరకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ కలిగి గతంలో ఎల్ ఆర్ ఎస్ కొరకు ఒక వెయ్యి రూపాయలు చెల్లించిన వారు వెంటనే ఎల్ఆర్ఎస్ లాగిన్ ద్వారా ఫీజు చెల్లించి ఫీజులు 25 శాతం పొందాలని అన్నారు. అనుమతి లేని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే రానున్న కాలంలో ప్రజలు ఇబ్బందులకు గురి అయ్యే ఆస్కారం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సబ్ రిజిస్టార్ అంబేద్కర్, టిపిఓ సోమయ్య, టి పిఓ ఎస్ శశికుమార్, ఆర్ఓ కళ్యాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం, 13.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





నూతనంగా ఎన్నికైన కంటోన్మెంట్ బోర్డ్ సభ్యుడు భానుక నర్మదా మల్లికార్జున్ ప్రమాణ స్వీకారంలో సికింద్రాబాద్ బిజెపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం శాలువాతో సన్మానించారు . అదేవిధంగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు ఈటెల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కనకట్ల హరి అరవింద్ కుమార్,అంబాలా రాజేశ్వర్ రావు, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, విశాలభారతి :

## మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ లకు శుభాకాంక్షలు



మేడిపల్లి,విశాలభారతి:

జాతీయ యూత్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ లు గా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్,గడ్డం ఇందుజా రెడ్డికి నియామక పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగానియమితులైన ఇంచార్జులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ శుభాకాంక్షలు తెలిపారు.ఎల్లవేళలా ఇంచార్జ్ లకు అందబాటులో యూత్ కాంగ్రెస్ పని చేస్తుందన్నారు.

# ఛాయాచిత్రకళలో వాస్తవాన్వేషణ

- గీతంలో ఫోటోగ్రఫీపై ఆతిథ్య ఉపన్యాసం చేసిన ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ జాన్





పటాన్ చెరు,విశాలభారతి

'ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానం' అనేది నానుడి. దానిని మరింత విస్తృతపరుస్తూ, ఛాయాచిత్రకళలో 'నిజాన్ని వెతుక్కుంటూ..' అనే శీర్షికన, ఐఐటీ హైదరాబాదుకు చెందిన డాక్టర్ దీపక్ జాన్ మాథ్యూ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఛాయాచిత్రకళపై లోతైన అవగాహనను ఏర్పరచేలా సాగిన ఈ కార్యక్రమంలో, ఫోటోగ్రఫీలో వాస్తవికత యొక్క అర్థం, దాని చారిత్రక పరిణామం, ప్రామాణికత, ఫోటోగ్రఫీ, పెయింటింగ్ మధ్య దీర్ఘకాలిక పరస్పర చర్యను ఆయన వివరించారు. శతాబ్దాలుగా ఫోటోగ్రఫీ ఎలా మారిపోయిందో డాక్టర్ మాథ్యూ అన్వేషించారు. వాస్తవికత యొక్క అవగాహనలను రూపొందించి, వాటిని పునర్నిర్వచించారు. ఎంతో ఆకర్షణీయంగా, ఆకట్టుకునేలా సాగిన ఈ కార్యక్రమం వివిధ విభాగాల నుంచి వచ్చిన విభిన్న ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది. దృశ్య కథ చెప్పే కళ, విజ్ఞాన శాస్త్రంపై తాజా దృక్పథాలను మాథ్యూ వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, అసోసియేషన్ ఆఫ్ డిజైనర్స్ ఇండియా, ఐఐటీ హైదరాబాదులు సహకారం అందజేశాయి.

**కుండల తయారీపై అవగాహన**

జీఎస్ హెచ్ఎస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం కుండల తయారీపై అత్యంత ఆకర్షణీయమైన ఒకరోజు కార్యశాలను నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారికి, మట్టితో పనిచేయడం వల్ల కలిగే సృజనాత్మక, చికిత్సా ప్రయోజనాలను తెలియజేసేలా సాగింది. కుండలు మానసిక దృష్టి, ఏకాగ్రతను ఎలా పెంచుతాయో, సృజనాత్మక ప్రక్రియకు మించి రోజువారీ జీవితంలోకి విస్తరించే ప్రశాంతతను, సద్బుద్ధిని ఎలా పెంపొందిస్తాయో ఈ కార్యశాలలో అవగతం చేశారు. చికిత్సా లక్షణాలకు ప్రసిద్ధి చెందిన కుండలు చేతులను బలపరుస్తాయని, ఒత్తిడిని తగ్గిస్తాయని, మొత్తం మీద స్వాంతనను ఇస్తాయని నిర్వాహకులు వివరించారు. బంకమట్టిని అచ్చువేసే స్పర్శ అనుభవం, ఆందోళన తగ్గించడానికి సహాయపడడమే గాక, కొంత ఉపశమనం ఇవ్వడంతో పాటు మానసిక, శారీరక చురుకుదనాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ జోస్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ వై.లలితా సింధూరి, కోర్సు సమన్వయకర్త డాక్టర్ ఆదిశేషయ్య సాడే తదితరులు పాల్గొన్నారు.



## ఓయూలో లా కాలేజ్ లో చెస్ , క్విజ్ పోటీలు

విశాలభారతి, ఓయూ:

ఆటలు వ్యక్తుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసే ఫిట్ నెస్ ను పెంపొందిస్తాయని ఓయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్.రాం ప్రసాద్ అన్నారు. బుధవారం ఓయూ న్యాయ విద్యార్థుల ఆధ్వర్యంలో డుసిమస్ 2025 లో కార్యక్రమంలో భాగంగా నేడు న్యాయ కళాశాల లో చెస్ , క్విజ్ పోటీలను ప్రిన్సిపాల్ ప్రొ.రాం ప్రసాద్ ప్రారంభించారు.ఈ చెస్ ,క్విజ్ పోటీల్లో నగరంలోని పలు లా కళాశాలాల విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో నిర్వహకులు గోపి, క్రాంతి, పరశురాం, రోహిన్,తేజ్ దీప్ ,భవ్య, సూచరిత, పాండు ,మహేష్ , రవీందర్, శివ,అరుద్రాక్షి విద్యార్థులు పాల్గొన్నారు.లా కాలేజ్ జరిగే డుసి మాస్ 2025 ను విజయవంతం చేయాలని విద్యార్థులు కోరారు.



## పాత నేరస్తుడు శంకర్ నాయక్ అరెస్టు

- 11 తులాల భంగారు ఆభరణాలు స్వాదీనం
- తెలంగాణ ఏపీ రాష్ట్రాల్లో 70 కేసుల్లో నిందితుడుగా.

విశాలభారతి, ఓయూ:

పలు పోలీస్టేషన్ల పరిధిలల్లో చోరీలు చేసి తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్థుడైన రత్లావత్ శంకర్ నాయక్ ను ఓయూ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.9 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలను స్వాదీనం చేసుకున్నారు.బుధవారం ఓయూ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఈస్ట్ జోన్ డీసీపి డా. బి. బాలస్వామి, జోన్ అడిషనల్ డీసీపి నర్సయ్య. ఇన్స్పెక్టర్ ఎన్. రాజేంద్ర నాయక్ లు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా నాగర్లబండ తండా, తూంకుంటకు చెందిన రత్లోవత్ శంకర్ నాయక్ (32), బిఫార్మసీ చేసి తాను చేసే ఉద్యోగంతో వచ్చే జీతం సరిపోక చోరీల బాటపట్టాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని రాత్రి సమయాల్లో తాళాలు పగులగొట్టి చోరీ చేసి వచ్చిన డబ్బుతో జల్సాలకు ఖర్చు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 2న, హబ్సిగూడ స్ట్రీట్ నెం.3 లో, తాళాలు వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసి ఇనుప రాడ్ తల్ తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న విలువైన బంగారు వస్తువులను చోరి చేసి పారిపోయాడు. దీంతో బాధితుడి ఫిర్యాదుతో ఓయూ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టారు. ఈక్రమంలో ఎల్బీనగర్లో బుధవారం నిందితుడు శంకర్ నాయక్ ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 11 తులాల బంగారం వస్తువులను స్వాదీనం చేసుకున్నారు. కాగా ఇతను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో 70 కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. మియాపూర్, పటాన్చెరువు, ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలల్లో ఇటీవల చోరీలు చేశాడు. శంకర్ నాయక్ తో పాటు మరో నేరస్తుడైన రేగుంట రాజశేఖర్ (29)ను కూడా అరెస్టు చేశారు. ఏసీపి జగన్ పర్య వేక్షణలో ఇన్స్పెక్టర్ రాజేంద్రనాయక్, క్రైం ఎస్సై యాసిన్ షరీఫ్, ఏఎస్సై ఈశ్వర్ క్రైం బృందం ఈ కేసును చేదించారు. వీరిని డీసీపీ బాలస్వామి అభినందించారు.



## ప్రణాళిక బద్ధంగా కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తాం

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అధికారులతో కలసి ఇన్ఫర్మేషన్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. అదేవిధంగా కాలనీవాసులు కాలనీలో ఉన్నటువంటి ప్రధాన రోడ్డు మార్గాల్లో కేవలం ఒకే మార్గంలో మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, మిగిలి ఉన్న ప్రధాన రోడ్డు మార్గాల్లో కూడా సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ కి విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిష్టమైన ప్రణాళికతో ఇన్ఫర్మేషన్ కాలనీలో పూర్తి స్థాయి లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని, కాలనీవాసులకి హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో డిఇ దామోదర్ ,ఏఇ హేము నాయక్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ ,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యం, శోభన్ కుమార్ ,ఫణి కుమార్ , కుమార్ , కృష్ణ బాబు , కాలనీవాసులు పాల్గొన్నారు.



## రేణుక ఎల్లమ్మ దేవాలయన్ని సందర్శించిన తలసాని

సికింద్రాబాద్, విశాలభారతి :

పద్మారావు నగర్ లోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజలలో మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో బుధవారం వేద పండితుల సూచనల మేరకు శాస్త్రోక్తంగా ఆలయ సంప్రోక్షణ, అమ్మవారికి అభిషేకం, పంచ హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలలో తలసాని అమ్మవారి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ పూజలలో ఏసీపీ జైపాల్ రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్,డీ ఐ రమేష్ గౌడ్, పద్మారావు నగర్ బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ఆలయ నిర్వహకులు సాయిరాం చారి, హరి చారి, నాయకులు మహేష్, లక్ష్మీపతి, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, రమణ, మహేందర్ గౌడ్, కుమార్ యాదవ్, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సంతోషకర వాతావరణంలో

## హోళి పండగ జరుపుకోవాలి

- సంప్రదాయ రంగులు ఉపయోగం ఆరోగ్యకరం.
- ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దు.
- మహిళల పట్ల మర్యాదగా ఉండాలి.
- కె.నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట.



సూర్యాపేట,విశాలభారతి:

హోళీ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పి కె. నరసింహా ఐపిఎస్ ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ఉత్సవం జరుపుకునేవారు జాగ్రత్తలు పాటించాలని కోరారు. యువత ఆదర్శంగా ఉండాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని , ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్ళవద్దని , సంప్రదాయ రంగులు ఉపయోగించడం ఆరోగ్యకరమని ఎస్పి తెలిపా రు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవం జరుపుకోవాలని , సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి అన్నారు. యువత వాహనాలను విచ్చలవిడిగా వేగంగా నడపవద్దని కోరినారు. నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని, ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దు అన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పి విజ్ఞప్తి చేసినారు. సీసీ కెమెరాల నిఘా ఉన్నదని, వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని , మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు అని ఎస్పి సూచించారు.



## బాల్కొండ శాఖ గ్రంథాలయం తనిఖీ

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

బాల్కొండ,విశాలభారతి:

బాల్కొండ మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయనను మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ పాఠకుల వసతుల గురించి,దినపత్రికలు, పుస్తకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.గ్రంథాల యానికి వచ్చే పాఠకులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.బాల్కొండ వాసులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని రాజిరెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్ గౌడ్,షేక్ వాహబ్,యునుస్,వడ్ల రాజేశ్వర్, కుందారం శీను,విక్కీ,తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి.

సూర్యాపేట,విశాలభారతి:

రైతులు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం బాధ్యతలు స్వీకరించింది. మార్కెట్ చైర్మన్గా కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్గా గట్టు శ్రీనివాస్, సభ్యులుగా ధరావత్ వీరన్న నాయక్, దాసరి తిరుమలరావు, నకిరేకంటి బాలకృష్ణ, పి.వెంకన్న, గొపగాని పెదవెంకన్న,ఎం.దామోదర్రెడ్డి, ఏ.కేశవులు, గోగుల పద్మ, చిన్నోజు నరసింహాచారి, షేక్ అబ్దుల్ కరీం,ఉప్పల సత్యనారాయణ, మాడ్గుల నవీన్కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, రైతులందరికీ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో సూర్యాపేట మార్కెట్లో అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మార్కెట్ లో పెద్ద ఎత్తున అభినందన సభ కూడా నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్ నాయకులు అనుభవం కలిగిన వారితోనే మార్కెట్ పాలకవర్గం ఏర్పడిందని, మార్కెట్ పాలకవర్గ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ రఘువీర్ రెడ్డిలతో పాటు పెద్దలు కుందూరు జానారెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మార్కెట్ కు చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు గజమాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



# ఇది నెవ్వర్ బిఫోర్ ఛాలెంజ్



ప్రభాస్ కెరీర్‌లో బాహుబలి తరువాత అతను వరుస ప్రాజెక్టులను అంగీకరించినా, సక్సెస్ మాత్రం ఆ రేంజ్ లో కనిపించలేదు. అయినా సరే, ఆయన పాన్ ఇండియా స్టార్‌గా తన స్థాయిని కొనసాగిస్తూనే ఉన్నాడు. అభిమానులంతా డార్లింగ్ నుంచి రెగ్యులర్‌గా సినిమాలను ఆశిస్తూనే ఉన్నారు. కానీ గత రెండు సంవత్సరాలుగా ప్రభాస్ సినిమాల మధ్య భారీ గ్యాప్ తీసుకోవడం, ఫిలిం నగర్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే, 2025 మాత్రం ఆయన కెరీర్‌లోనే అత్యంత బిజీగా ఉండబోయే ఏడాదిగా నిలుస్తుందని తాజా సమాచారం. ఇప్పటికే ప్రభాస్ చేతిలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే, వీటిలో రాజా సాబ్ ముందుగానే వస్తున్నా ఆ తరువాత మాత్రం ఏ సినిమా ముందు ప్రేక్షకుల ముందుకు వస్తుంది? అనే చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫౌజీ సినిమా కోసం ప్రభాస్ భారీగా డేట్స్ కేటాయించాడు. 1940ల కాలం నాటి కథతో రూపొందుతున్న ఈ సినిమా, ఆయన కెరీర్‌లోనే ఓ ప్రత్యేకమైన పీరియాడికల్ డ్రామాగా నిలవబోతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభాస్ తన ఇతర కమిట్మెంట్స్‌ను కొన్ని నెలల పాటు పక్కన పెట్టినట్లు సమాచారం. అంతేకాదు, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజా సాబ్ కూడా ప్రభాస్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులలో ఒకటి. మొదట ఈ సినిమా చాలా తక్కువ బడ్జెట్‌తో రూపొందిస్తారనే ప్రచారం సాగినప్పటికీ, సినిమా స్కేల్ పెంచి, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. ఇందులో ప్రభాస్ రెండు వేరియేషన్లు కలిగిన పాత్రలో కనిపించబోతున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కానీ ఇంకా కొన్ని పాటలు, ప్యాచ్‌వర్క్ మిగిలి ఉండటంతో, ప్రభాస్ దీనిపై పూర్తిగా ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాక, ప్రభాస్ పూర్తిగా స్పిరిట్ షూటింగ్‌పై దృష్టి పెడతాడు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కబోయే ఈ సినిమా ఆయన కెరీర్‌లోనే మిగిలిన సినిమాల కంటే పూర్తి భిన్నంగా ఉండబోతోంది. సందీప్ రెడ్డి వంగా తన చిత్రాల్లో హీరో పాత్రను విభిన్నంగా మలిచే విధంగా కథను డిజైన్ చేస్తాడు. అదే విధంగా, ప్రభాస్ ఈ సినిమాలో చాలా ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించనున్నాడని సమాచారం. 2025 జూన్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందట. ఇంతకుముందు ప్రభాస్ ఒకే సమయంలో ఒకటి లేదా రెండు సినిమాలు చేయడం కామన్. కానీ ఈసారి, మూడు ప్రాజెక్టులను ఒకేసారి బ్యాలెన్స్ చేయడం నిజంగా భారీ ఛాలెంజ్. ఆయా సినిమాల కథా నేపథ్యం వేరుగా ఉండటంతో, నటన పరంగా ప్రభాస్ పూర్తిగా సరికొత్త మార్పులతో ముందుకు వెళ్లాలి. ఏ సినిమా ఆలస్యం జరిగినా, 2026 క్యాలెండర్ మారిపోతుంది. అందుకే, ప్రభాస్ ఈసారి పెద్దగా బ్రేక్స్ తీసుకోకుండా షూటింగ్‌లను పూర్తి చేయాలని చూస్తున్నాడు. మొత్తానికి, 2025 ప్రభాస్ కోసం అత్యంత క్లిష్టమైన సంవత్సరం కాబోతోంది. మూడు భారీ ప్రాజెక్టులు ఉండటంతో, అన్నీ తగిన స్థాయిలో ప్రమోట్ చేయడమూ, ప్రేక్షకుల అంచనాలను అందుకోవడమూ అవసరమే. ప్లాన్ ప్రకారం రాజాసాబ్, ఆ తరువాత హను ప్రాజెక్టు, స్పిరిట్ వచ్చే ఛాన్స్ ఉంది.



# రామ్ చరణ్ కు బాలీవుడ్ ఆఫర్ ?



తమిళ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ చేసిన గేమ్ ఛేంజర్ ఎన్నో అంచనాలతో వచ్చి డిజాస్టర్ అయింది. మెగా ఫ్యాన్స్ ఆశలన్నింటి పైనా గేమ్ ఛేంజర్ నీళ్లు చల్లింది. రామ్ చరణ్ మాత్రం గేమ్ ఛేంజర్ రిజల్ట్ ను పక్కన పెట్టేసి తన తర్వాతి సినిమా కోసం రెడీ అయిపోయి, ఆల్రెడీ దానికి సంబంధించిన షూటింగ్ ను కూడా మొదలుపెట్టాడు. చరణ్ తన తర్వాతి సినిమాను ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో చేయనున్న విషయం తెలిసిందే. చరణ్ కెరీర్ లో 16వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ ను ఈ ఏడాది చివరకు పూర్తి చేయాలని బుచ్చిబాబు ప్లాన్ చేసుకున్నాడు. బుచ్చిబాబు సినిమా తర్వాత రామ్ చరణ్, సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమాకు ఆల్రెడీ కమిటయ్యాడు. కానీ సుకుమార్ చరణ్ తో సినిమాను మొదలుపెట్టడానికి చాలా టైమ్ పట్టేట్టుంది. సినిమా స్క్రిప్ట్ కోసమే సుకుమార్ దాదాపు ఏడాది సమయం తీసుకోవాలనుకుంటున్నాడు. దాంతో పాటూ సుకుమార్ సొంత బ్యానర్ సుకుమార్ రైటింగ్స్ లో కూడా తనకు కొన్ని కమిట్‌మెంట్స్ ఉన్నాయి. అంటే బుచ్చిబాబు సినిమా పూర్తయ్యాక సుకుమార్ మూవీ మొదలు పెట్టేలోపు చరణ్ కొంత కాలంపాటూ ఫ్రీ గా ఉండనున్నాడు. ఈ గ్యాప్ లో ఖాళీగా ఉండకుండా ఓ సినిమా చేయాలని చూస్తున్నాడట చరణ్. అందులో భాగంగానే చరణ్ కొంతమందితో చర్చలు జరుపుతున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలోనే బాలీవుడ్ నిర్మాత మధు మంతెనతో చరణ్ స్క్రిప్ట్ గురించి డిస్కషన్స్ చేస్తున్నాడని తెలుస్తోంది. కొందరు హిందీ డైరెక్టర్లు చరణ్ తో డిస్కషన్స్ చేస్తున్నారని కానీ ఆ చర్చలన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయని టాక్. ఇప్పటికైతే ఇంకా ఏదీ ఫిక్సవలేదు కానీ సరైన స్క్రిప్ట్, డైరెక్టర్ దొరికితే మధు మంతెన నిర్మాణంలోనే సినిమా చేయాలని చూస్తున్నాడు చరణ్. మధు మంతెనకు, చరణ్ తో మంచి బాండింగ్ ఉంది. చరణ్ ముంబైలో ఉన్నప్పుడు మధునే అన్నీ దగ్గరుండి చూసుకుంటారు. మరి బాలీవుడ్ లో చరణ్ ను ఏ డైరెక్టర్ మెప్పిస్తాడో చూడాలి.

# S/O వైజయంతి.. కళ్యాణ్ రామ్ కిల్లర్ లుక్

టాలీవుడ్‌లో హీరో కళ్యాణ్ రామ్ ఎప్పటికప్పుడు కొత్త కథాంశాలతో ప్రయోగాలు చేస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు, ఆయన మరోసారి ఫుల్ లెంగ్త్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'అర్జున్ S/O వైజయంతి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమా, ఇప్పటికే భారీ అంచనాలను క్రియేట్ చేసింది. అయితే, ఈ ప్రాజెక్ట్‌లో అసలు హైలైట్ ఏమిటంటే, లెజెండరీ నటి విజయశాంతి మళ్లీ ఓ పవర్‌ఫుల్ పాత్రలో స్క్రీన్‌పై కనిపించబోతున్న విషయం. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా విడుదల చేశారు. తాజాగా, మూవీ ప్రీ టీజర్ విడుదల తేదీని ప్రకటించేందుకు మరో స్టైలిష్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కొత్త లుక్‌లో కళ్యాణ్ రామ్ మాస్, స్టైల్, ఇన్టెన్సిటీ అన్నీ కలిపి కనిపిస్తున్నారు. హై ఓక్టేన్ యాక్షన్ మోడ్‌లో నిలుచొని, బ్యాక్‌డ్రాప్‌లో ఒక భారీ వర్క్ ఫీల్డ్ ఉండటం సినిమాకి ఆసక్తిని మరింత పెంచింది. ఒక్క మాటలో కళ్యాణ్ రామ్ కిల్లర్ లుక్ అంటూ నెటిజన్లు పాజిటివ్ గా హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఈ సినిమా కథ గురించి అధికారిక సమాచారం వెలువడకపోయినా, టైటిల్ చూస్తే కథలో ఎమోషనల్ డెప్త్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామా ఉండే అవకాశం కనిపిస్తోంది. కళ్యాణ్ రామ్ గతంలో హార్డ్ హిట్టింగ్ యాక్షన్ మూవీస్ చేసినప్పటికీ, ఈ సినిమా మాత్రం ఇంకాస్త ఇంటెన్స్‌గా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. విజయశాంతి పాత్ర కూడా చాలా ముఖ్యమైనదిగా ఉండబోతోందని ఫిలింనగర్ టాక్. గతంలో 'సరిలేరు నీకెవ్వరు'తో తన రీ ఎంట్రీ ఇచ్చిన విజయశాంతి, ఇప్పుడు మరింత స్ట్రాంగ్ క్యారెక్టర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్ విలన్‌గా నటిస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. అలాగే, కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు తగ్గట్లుగా ఉండనుందని సమాచారం. ప్రస్తుతం టాలీవుడ్‌లో మాస్ సినిమాలకు మంచి ఆదరణ పెరుగుతోంది. 'అర్జున్ S/O వైజయంతి' కూడా ఆ కోవలో చేరేలా కనిపిస్తోంది. టైటిల్‌లోనే ఉన్న బలమైన ఎమోషన్, పాత్రల మధ్య ఉన్న ఇంటెన్సిటీ సినిమాను మరింత ఆసక్తికరంగా మార్చబోతోంది. ముఖ్యంగా, కళ్యాణ్ రామ్ గతంలో చేసిన సినిమాలకు భిన్నంగా, ఈ ప్రాజెక్ట్ పూర్తిగా కొత్త కోణంలో ఉండబోతుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి, ఈ సినిమా ఒక పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి వస్తోంది. కంటెంట్ పరంగా, టెక్నికల్ టీమ్ పరంగా హై బడ్జెట్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతుండటంతో, దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. మరి, ఈ సినిమా కళ్యాణ్ రామ్ కెరీర్‌లో ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుందో చూడాలి.



# ప్రణిత స్టైలిష్ అవతార్

కన్నడ మూవీ 'పోర్కి' తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణిత సుభాష్. రెండో సినిమానే తెలుగులో చేసింది. 'ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో ఆకట్టుకుని గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ వెంటనే సిద్దార్థ్ హీరోగా నటించిన 'బావ' సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయిగా నటించి పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో అలరించడం వల్ల హీరోయిన్‌గా మంచి పేరు సొంతం చేసుకుంది. అయితే లక్ కలిసి రాక పోవడంతో స్టార్ హీరోయిన్‌గా ఇమేజ్‌ను దక్కించుకోవడంలో విఫలం అయింది. పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ప్రణిత ఆ వెంటనే ఎన్టీఆర్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. స్టార్ హీరోల సినిమాల్లోనూ నటించిన ప్రణితకి సరైన బ్రేక్ దక్కలేదు. దాదాపు పదేళ్ల పాటు ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చిన ప్రణిత ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా సినిమాల్లో నటించేందుకు ఈమె రెడీగా ఉంది. గత సంవత్సరం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకలు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం కూడా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు దాటినప్పటికీ అందం విషయంలో ఇంకా కొత్త హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా ఉంటుంది. మూడు పదుల వయసులో పడ్డా కూడా ప్రణిత ఆకట్టుకుంటుంది. 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఇప్పటికీ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె స్టైలిష్ డ్రెస్‌లో ట్రెండీ డ్రెస్‌ల్లో ఎక్కువగా అలరిస్తూ ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ ప్రణీత సుభాష్ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె మరోసారి స్టైలిష్ అవతార్‌లో కనిపించింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో డిఫరెంట్ లుక్, స్టైల్‌తో అలరించిన ఈ అమ్మడు మరోసారి అలరించింది. క్యూట్ లుక్‌తో స్కిన్ షో చేయకుండానే ప్రణిత చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రణిత అందంకు స్టార్ హీరోలకు జోడీగా ఇప్పటికి వరుసగా సినిమాలు చేయాల్సి ఉంది. సమంత స్థాయిలో స్టార్‌డంను సొంతం చేసుకోవాలి. కానీ ఆ స్థాయిలో ప్రణితకు ఆఫర్లు రాలేదు. లక్ కలిసి రాకపోవడంతో ఈమెకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. ముందు ముందు అయినా ప్రణిత తన అందంతో అలరించి సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా అయినా నటించే అవకాశాలు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.